


యూరియా
## కొరత తీరినట్టే!
జిల్లాకు 1,850 మెట్రిక్ టన్నుల దిగుమతి
8లో..

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 15 జూలై 2025



# అక్కడలా.. ఇక్కడిలా...
ఆంధ్రజ్యోతి పరిశీలన
# ఎందుకలా!?

- మండల కార్యాలయాల్లో మొక్కుబడిగా పీజీఆర్ఎస్
- జవాబుదారీతనం లేకపోవడమే కారణమా!?
- అన్నీ కార్యాలయాల్లో రెండంకెలు దాటని అర్జీల సంఖ్య
- కలెక్టరేట్‌కు పెరుగుతున్న అర్జీదారుల తాకిడి
- సోమవారం ఒక్కరోజే 555 వినతుల స్వీకరణ

2.. 3.. 5.. 5..6... అరె ఇవేవో నీట్, ఎంసెట్ ఇతర పోటీ పరీక్షల్లో వచ్చిన ర్యాంకులు అనుకుంటున్నారా!? అయితే మీరు పొరబడ్డట్టే. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సోమవారం కలెక్టరేట్ నుంచి మండలస్థాయి కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (గ్రీవెన్స్ డే) వచ్చిన అర్జీల సంఖ్యలివి. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో అర్జీల సంఖ్య పదికి దాటడం లేదు. ఇందుకు ప్రధాన కారణాలే ఉన్నాయి. ఇక్కడ అర్జీ ఇచ్చినా ఫలితం ఉండదనే భావనతో అందరూ నెల్లూరులోని కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. అసలు మండల కార్యాలయాల్లో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' బృందం ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలను విజిట్ చేసింది. ఈ విజిట్‌లో అధికారుల మొక్కుబడితత్వం కొట్టొచ్చినట్టు కనిపించింది.

### ● వచ్చామా.. వెళ్లామా!?

సమయపాలన పాటించకుండా కొందరు అధికారులు వచ్చామా.. వెళ్లమా.. అంటూ, మరికొందరు తమ సిబ్బందిని పంపి రిజిస్టర్‌లో సంతకాలు చేయిస్తూ మమ అనిపిస్తున్నారు. కొన్ని శాఖల అధికారులు అసలు రావడమే మానేశారు. వాస్తవంగా అన్ని ప్రభుత్వ శాఖల (సుమారు 17 శాఖలు) అధికారులు ఈ గ్రీవెన్స్‌లో పాల్గొనాలి. కానీ రెండు లేదా ఐదు శాఖల అధికారులు వచ్చి వెళ్లిపోతున్నారు. ఇంకేముంది... అర్జీలు అందజేసినా సమస్యలు పరిష్కారం కావడంలేదనే భావనతో ప్రజలంతా కలెక్టరేట్‌కు పరుగులు తీస్తున్నారు. ఆ వివరాలు సంక్షిప్తంగా...

### అలా వచ్చి...


10.45 గంటలకు గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులు, సిబ్బంది

**ఉదయగిరి :** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 10.45 గంటలకు తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీవో అప్పాజీ, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఏఎస్‌డబ్ల్యూవో రమణారెడ్డి, ఆర్అండ్‌బీ, హౌసింగ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఆ తర్వాత 2, 3 శాఖల అధికారులు వచ్చారు. అధికారులెవరూ సమయపాలన పాటించలేదు. మరోవైపు వచ్చామా.. రిజిస్టర్‌లో సంతకం చేశామా!? వెళ్లామా!? అన్నరీతిలో వ్యవహరించారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తే అధికారులెవరూ లేరంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

### ఎవరు ఎక్కడుంటారో తెలియక

**సంగం :** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లా నాయక్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ వేర్వేరుగా గ్రీవెన్స్ డే నిర్వహించారు. మిగతా మండల స్థాయి అధికారులు ఎవరు ఎక్కడ హాజరవుతారో, తమ అర్జీలు ఎక్కడ ఇవ్వాలో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. అసలు ఎవరు ఎక్కడ ఉంటున్నారో, ఎన్ని గంటలకు వస్తారో తెలియదు. వీలున్న సమయంలో వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్తున్నారే కానీ పట్టుమని పది నిమిషాలు కూర్చున్న దాఖలాలు లేదు. ఇది ఇలా ఉంటే తహసీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో ఐదు అర్జీలు వచ్చాయి.

● **సీతారామపురం :** అధికారులు రాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం బోసిపోయింది. తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఒకటి రెండు శాఖల అధికారులు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన వారంతా డుమ్మా కొట్టారు. సుదూర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు.


ఆత్మకూరు : మధ్యాహ్నం 12.40 గంటలకు తహసీల్దారు కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు


ఏఎస్‌పేట : ఉదయం 10:40 గంటలకు తహసీల్దారు కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు


నెల్లూరు : అర్జీదారులతో కిటకిటలాడుతున్న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం

● **ఏఎస్ పేట :** తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 10.40 గంటలకు అధికారులెవరూ రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. మరోవైపు కార్యాలయంలో నెల రోజులుగా వీడియోకాన్ఫరెన్స్ పరికరాలు పని చేయకపోవడంతో ఇక్కడున్న అధికారులు సంగంకు వెళుతున్నారు.

● **అల్లూరు :** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆరు అర్జీలు వచ్చాయి. కాగా, తహసీల్దారు లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దారు, సర్వే శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. అర్జీదారులు అత్యధికంగా లేకపోవడంతో గ్రీవెన్స్‌ను అధికారులు త్వరగా ముగించారు.

### మొక్కుబడి తంతే!


ఆత్మకూరు : ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో పావని ఒక్కరే...

**ఆత్మకూరు :** ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఉదయం 10.25 గంటలకు తహసీల్దారు పద్మజాకుమారి గ్రీవెన్స్‌డేలో పాల్గొన్నా రు. 10.40లకు హౌసింగ్ ఏఈ, సర్వేయర్, ఆర్ఐ మాత్రమే హాజరయ్యారు. తదనంతరం ఎంపీడీవో, ఇరిగేషన్ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, విద్యుత్ శాఖ ఏఈ, ఎంపీఈవోలు వచ్చారు. ఎంపీడీవో రఫీఖాన్ కొద్దిసేపు ఉండి తనకు పని ఉందని తహసీల్దారు అనుమతితో వెళ్లిపోయారు. 6 అర్జీలు మాత్రమే గ్రీవెన్స్ డేకు వచ్చాయి. మధ్యాహ్నం 1 గంట వరకు గ్రీవెన్స్ డే నిర్వహించాల్సి ఉన్నా 12.40 గంటలకు అధికారులంతా వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

● ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఎవరూ రాలేదు. ఉదయం 10.55 గంటలకు ఆర్డీవో పావని ఒక్కరే హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు అంతకు మించి ఏ ఒక్క శాఖ అధికారి గ్రీవెన్స్ డేకు హాజరుగాక పోవడం గమనార్హం.

**లింగసముద్రం :** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మూడొంతులకుపైగా అధికారులు డుమ్మా కొట్టారు. కార్యాలయంలో నాలుగైదు నెలల నుంచి ఏపీ ఫైబర్ నెట్ కనెక్షన్ మోనిటర్‌కు లేకపోవడంతో తహసీల్దారు సీతామహాలక్ష్మి కలిగిరిలో పాల్గొన్నారని ఆర్ఐ తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, ఏవో రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధాదేవి మాత్రమే ఉన్నారు. మూడు అర్జీలు మాత్రమే వచ్చాయి.

### కలెక్టరేట్‌కు 555 అర్జీలు...

**నెల్లూరు (హరనాథపురం) :** మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవటంతో జిల్లా కేంద్రంలో కలెక్టర్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తుతున్నారు. సోమవారం 555 అర్జీలు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. వీటిలో 215 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే. మండల స్థాయిలోనే అర్జీలు సమర్పించాలని కలెక్టర్ సూచిస్తున్నా, అర్జీదారులు మాత్రం కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. రికార్డు స్థాయిలో 555 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 215 అర్జీలు, సర్వే శాఖకు 48, మున్సిపల్ శాఖకు 43, పంచాయతీరాజ్ శాఖకు 53, పోలీసు శాఖకు 52, సివిల్ సప్లయిస్‌కు 8 అర్జీలు వచ్చాయి. భూ సమస్యలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ఆనంద్ వెంటనే జాప్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ అర్జీల మీద ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నా, సమస్యలు సమస్యలుగానే మిగులుతున్నాయి, అర్జీలు మాత్రం పెరిగిపోతున్నాయి. వీటికి ప్రత్యేక పరిష్కారాన్ని జిల్లా యంత్రాంగమే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

---

భూములు తీసుకోబోమని
చంద్రబాబు, లోకేష్
## చెబితేనే నమ్ముతాం!
కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరికి తేల్చిచెప్పిన మత్స్యకారులు

ఉలవపాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : 'మా వ్యవసాయ భూములను పరిశ్రమలకు తీసుకోమని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చేత చెప్పిస్తేనే నమ్ముతా'మని కరేడు శివారు గ్రామం టెంకాయచెట్లపాలెం మత్స్యకారులు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు తేల్చిచెప్పారు. సోమవారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే టెంకాయచెట్లపాలెంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాములవారిగుడి ఎదురుగా గ్రామస్థులు సమావేశం ఏర్పాటు చేశారు. ఏడాదికి రెండు పంటలు పండించే భూములు పరిశ్రమలకు ఇవ్వబోమని గ్రామస్థులమంతా కట్టుమీద ఉన్నామని, తమ భూముల జోలికి రావద్దని కాపులు తేల్చి చెప్పారు. దీంతో ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ మత్స్యకారుల భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోల భూసేకరణ జరగదని ఎమ్మెల్యేగా తాను హామీ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత జీవో ప్రకారం 4500 ఎకరాలకు మాత్రమే భూసేకరణ ఉంటుందని మత్స్యకార గ్రామాల భూములు ఎక్కడికి పోవని మాటిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కొందరు గ్రామస్థులు పలు సందేహాలు వ్యక్తం చేస్తూ... ఇలాగే చెప్తారు ఉన్నతాధికారులు, పైనున్న ప్రభుత్వ పెద్దలు రెండో విడతలో మా భూములు తీసుకోరని గ్యారంటీ ఏమిటని, 8వేల ఎకరాలు భూమి కావాలని ప్రభుత్వం చెబుతోంది కదా మిగిలిన 4వేల ఎకరాలు తీసుకోవడానికి ఇంక కరేడులో భూమి లేదు మా భూములు మాత్రమే మిగిలి ఉన్నాయని సందేహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో చెప్పించి భరోసా కల్పించాలని మత్స్యకారులు ఎమ్మెల్యేని కోరారు. వారిని కలిసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుబ్బారావు, ఆదాము, బాలమురళి, పోలిశెట్టి, రామదాసు, శ్రీనివాసులు, రాంబాబు పాల్గొన్నారు.


ఏపీపీఎస్సీ పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో హుస్సేన్ సాహెబ్

## నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు
● మూడు కేంద్రాల్లో 23 వరకు నిర్వహణ ● పక్కాగా ఏర్పాట్లు : డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) లెక్చరర్ పోస్టుల భర్తీకి మంగళవారం నుంచి పరీక్షలు నిర్వహించనున్నదని, ఈ పరీక్షలు ఈనెల 23వతేదీ వరకు జరుగుతాయిని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ పేర్కొన్నారు. పరీక్షల ఏర్పాట్లపై సోమవారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ఈ పరీక్షలను నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, పొట్టేపాళెం సమీపంలోని ఆయాన్ డిజిటల్, కావలిలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల తరువాత, మధ్యాహ్నం 2 గంటల తరువాత పరీక్ష కేంద్రాలలోకి అభ్యర్థులను అనుమతించబోమని తెలిపారు. అభ్యర్థులు గంట ముందుగానే ఆయా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సులను నడపాలని, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను డీఆర్వో ఆదేశించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెట్టప్రాంతానికి వరం!

- ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల
- ఐదు కోర్సులతో 300 సీట్లు అందుబాటులోకి..
- ఈ ఏడాది నుంచే తరగతుల ప్రారంభం
- రెండేళ్లపాటు నెల్లూరులో తాత్కాలిక తరగతులు
- సొంత భవనాలు నిర్మించాక ఆత్మకూరుకు తరలింపు
- ఫలించిన మంత్రి ఆనం కృషి

ఆత్మకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. ఈ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాలనే రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి ఫలించి, ఆత్మకూరుకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరైంది. ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఉమ్మడి రాష్ట్రానికి ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ప్రస్తుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ అప్పట్లో కార్యచరణకు నోచుకోలేదు. గత ఎన్నికల సమయంలో ఆత్మకూరులో నిర్వహించిన సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే తప్పనిసరిగా ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా ఆనం పావులు కదిపారు. ఇటీవల ఆత్మకూరులో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఆమోదం లభించింది. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలో ఇంజనీరింగ్ కళాశాల ఈ ఏడాది నుంచే ఆరంభం కానుంది. మొదటగా 300 మంది విద్యార్థులతో ఐదు బీటెక్ కోర్సులు ప్రారంభానికి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. అయితే తాత్కాలికంగా నెల్లూరులోని వీఆర్ ఐపీఎస్ కళాశాల భవనాల్లో బీటెక్ తరగతులు నిర్వహిస్తారు. రెండేళ్లలో ఆత్మకూరులో భవనాలు నిర్మించి ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని కొనసాగిస్తారు.



కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నుంచి, నిరంతర విద్యుత్‌తో పల్లెల ముఖ చిత్రం మార్చే పథకం నత్తనడకన సాగుతోంది. జిల్లావ్యాప్తంగా పల్లెలకు త్రీఫేస్ లైన్‌తో 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి నిర్దేశించిన ఆ పథకం పనులు రెండేళ్లుగా మందకొడిగా జరుగుతున్నాయి. అయితే పనులను వేగవంతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాది పనులు పూర్తయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ క్రమంలో రాబోయే సంవత్సరం జిల్లాలో ప్రతీ గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. - వివరాలు 8లో..

## పల్లె ఫేస్ మారేనా?
గ్రామాలకు త్రీఫేస్ కరెంటు ఎప్పటికో!
రాష్ట్ర ప్రభుత్వ ఫోకస్‌తో వేగవంతం



## 'ఎగ్'బాకుతోంది!
● ఎన్నడూ లేనివిధంగా ధర

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): అనుకోకుండా ఇంటికి వచ్చే అతిథులకు సులభంగా ఆతిథ్యం ఇచ్చేది కోడిగుడ్డుతోనే... రోజూ గుడ్డు తినండి.. ఆరోగ్యంగా ఉండండి... అని వైద్యులు సలహా ఇస్తుంటారు. అలాంటి కోడిగుడ్డు నేడు కొండెక్కింది. రిటైల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 నుంచి రూ.7.50గా ఉంది. తక్కువ ధరలో పోషకాలు లభించేది కోడిగుడ్డులోనే. కోడిగుడ్డు ధర భగ్గుమనడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో కోడిగుడ్ల ఉత్పత్తి కేవలం 3లక్షల లోపేఉంది. ప్రస్తుతం హోల్‌సేల్ వ్యాపారులు హైదరాబాద్ నుంచి జిల్లాకు 10లక్షల కోడిగుడ్లను దిగుమతి చేసుకుంటున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ.5.25 నుంచి రూ.5.85గా ఉంది. మధ్యవర్తులు, రిటైల్ వ్యాపారులు మాత్రం గుడ్డును రూ.7 నుంచి రూ.7.50లకు విక్రయిస్తున్నారు.

## ఐటీఐ రెండో విడత అడ్మిషన్ల గడువు పొడిగింపు

పొదలకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరులోని పారిశ్రామిక శిక్షణ సంస్థలో 2025-26 సంవత్సరానికి రెండో విడత అడ్మిషన్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20 వరకు గడువు పొడి గించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ సాంబమూర్తి సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు జూలై 22 మధ్యాహ్నం 1 గంటలోపు సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. జూలై 23, 25 తేదీలలో కౌన్సిలింగ్ జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**బంగారం, వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ.9445 |
| వెండి కిలో ధర | రూ. 117400 |
| వెండి ఒక గ్రాము | రూ. 120.40 |

## శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

కొడవలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టపాతోపు గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం టీడీపీ నాయకులు తువ్వర ప్రవీణ్ ఆధ్వర్యంలో తహసీల్దారు స్ఫూర్తిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన వ్యక్తులు మరణిస్తే పూడ్చేందుకు స్థలం లేదని, అధికారులు స్పందించి శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. తహసీల్దారు స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## అకౌంటెంట్‌పై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేత పురంధర్‌రెడ్డి

విడవలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విడవలూరులోని మండల సమాఖ్య కార్యాలయంలో అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని స్థానిక టీడీపీ నాయకుడు పొన్నలూరు పురంధర్ రెడ్డి ఆరోపించారు. అకౌంటెంట్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం ఏపీఎం వెంకటమ్మకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అకౌంటెంట్ కార్యాలయానికి రోజూ రావాల్సివుండగా, తన భర్త ఇదే శాఖలో పనిచేస్తుండడంతో ఆయన అండ దండలు చూసుకుని ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారన్నారు. గత నెలలో కేవలం 3 రోజులు మాత్రమే పని చేశారన్నారు. దీంతో పొదుపు మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆమెపై చర్యలు తీసుకోవాలన్నారు.

## గ్రావెల్ అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోండి



డీటీకి బీజేపీ నాయకుల వినతి

పొదలకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొందరు అక్రమార్కులు రాత్రి వేళ అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని, చెరువు మట్టిని పొలాలకు తరలిస్తున్నారని ఎలాంటి అనుమతులూ లేకుండా గ్రావెల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దారుతో పాటు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్, నాయకులు చొప్పా వెంకటేశ్వర్లు, చింతగింజల సుబ్రహ్మణ్యం, దేవరం అమరనాథ్ రెడ్డి, గురుస్వామి కలిసి డిప్యూటీ తహసీల్దారు సురేఖకు, స్థానిక పోలీసు స్టేషన్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## పూరిల్లు దగ్ధం.. చిన్నారి సురక్షితం



సహాయం చేస్తున్న సన్నారెడ్డి సురేష్‌రెడ్డి

తోటపల్లిగూడూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వరకవిపూడి పంచాయతీ, ఎస్టీ కాలనీలో సోమవారం ఓ పూరిల్లు దగ్ధమైంది. ఆదిపూడి హనుమంతు ఇంటిలో హఠాత్తుగా మంటలు చెలరేగడంతో ఇల్లు దగ్ధమైందని స్థానికులు తెలిపారు. మంటల్లో ఒక చిన్నారి చిక్కుకుపోగా స్థానికులు రక్షించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సంఘటన విషయం తెలుసుకున్న టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు, తోటపల్లిగూడూరు సొసైటీ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాలతో సచివాలయ సిబ్బంది బాధితురాలు ఆదిపూడి కావమ్మకు ఇల్లు కట్టిస్తామని భరోసా ఇచ్చారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పొదలకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరాయపాలెం వద్ద సోమవారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. రెండు బైక్‌లు ఢీకొనడంతో చేజర్ల మండలం నడిగడ్డ అగ్రహారానికి చెందిన వెంకటేశ్వర్లు మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. అలాగే సూరాయపాలెం ఇసుక రీచ్, డ్రెడ్జింగ్ పాయింట్ వద్ద పడవలో పైపును తీసుకురావడానికి వెళ్లిన గుంటూరు జిల్లాకు చెందిన శివనాగరాజు (30) పడవ మోటారు పేలడంతో నీటిలో పడి మృతి చెందాడు. పొదలకూరు ఎస్‌ఐ హనీఫ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎండుతున్న పైరు.. రైతన్నల ఫైర్!

**● చివరి ఆయకట్టుకు అందని సాగునీరు ● పట్టించుకోని అధికారులు**



సాగునీరు అందక ఎండుతున్న వరిపైరు

విడవలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): 'వరుణుడు కరుణించడంతో చెరువుల్లో సాగునీరు పుష్కలంగా ఉంది. చివరి ఆయకట్టు వరకు సాగునీరు తప్పకుండా అందించండి. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు' అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఓ వైపు అధికారులను సమావేశాల్లో హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ఇది అధికారుల నిర్లక్ష్యమో.. నీటి సంఘం అధ్యక్షుల పర్యవేక్షణ లోపమో.. తెలీదు గానీ మొత్తానికి రైతులు మాత్రం సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**●ఎండుతున్న వరి చేలు :** మండలంలో ఖరీఫ్ కింద సుమారు 20 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. చౌకిచర్ల నుంచి రామతీర్థం వరకు ఈస్ట్రన్ చానల్ ద్వారా సాగునీరు అందుతుంది. రైతులకు పూటల లెక్కన సాగు నీటిని అధికారులు వదులుతారు. ఎగువన ఉన్న చౌకిచర్ల, విడవలూరు, దంపూరు, వావిళ్ల గ్రామాల రైతులకు సాగునీరు పుష్కలంగా అందుతున్నాయి. అయితే చివరి గ్రామాలైన దండిగుంట, గాదెలదిన్నె, వరిణి, అలగానిపాడు రైతుల పొలాలకు సాగునీరు అందడం లేదు. ఫలితంగా సుమారు 250 ఎకరాలు ఎండిపోతుండడంతో రైతుల బాధలు వర్ణనాతీతం. ఈ విషయమై అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దిగువన ఉన్న పంట పొలాలకు అందటం లేదని రైతులు వాపోతున్నారు. కలాసీలు ముడుపులు తీసుకుని కాలువ పైన ఉన్న రైతులకు రాత్రివేళ నీరు వదులుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**● కలాసీల ఇష్టారాజ్యం :** కాలువ కింద ఉన్న పొలాలకు కలాసీల పర్యవేక్షణలో నీటిని విడుదల చేస్తారు. అయితే సాగునీరు విడుదల్లో కలాసీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సాగునీరు విడుదల్లో నిబంధనలను పాటించకుండా బిల్లు ముడి (చెక్కఎత్తే పరికరం)ని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేసి, కాలువల మీద పెత్తనం కూడా ఇచ్చేశారు. ముడుపులు ఇచ్చిన రైతులకు సాగునీరు విడుదల చేస్తూ చివరి ఆయకట్టుదారులకు మొండి చేయి చూపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జిల్లాధికారులు పట్టించుకుని సాగునీటి విడుదలలో ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

### సాగునీటి సమస్య పరిష్కరిస్తాం..

కనిగిరి చెరువు నుంచి విడవలూరుకు వెళ్లే మార్గంలో [illegible] సాధ్యమైనంత త్వరలో సరఫరా చేస్తాం..

సురేష్, ఇరిగేషన్ ఏఈ

# నాన్సెన్స్.. పేరుకే గ్రీవెన్స్

**• వెంకటాచలంలో ఫిర్యాదులు రెండే • విడవలూరులో అధికారుల డుమ్మా**





విడవలూరు: గ్రీవెన్స్‌డేలో పాల్గొన్న ముగ్గురు అధికారులు, వెంకటాచలం: ఫిర్యాదులు స్వీకరిస్తున్నతహసీల్దారు శ్రీనివాసులు

విడవలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం తహసీల్దారు కాలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ నామ మాత్రంగా ఉంటోంది. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో తహసీల్దారు, అంగన్‌వాడీ సూపర్ వైజరు, వ్యవసాయాధికారి తప్ప మిగిలిన అధికారులెవరూ హజరు కాలేదు. అన్ని శాఖల అధికారులూ తప్పకుండా హజరు కావాల్సివుండగా తహసీల్దారు చంద్రశేఖర్, మండల ప్రజా పరిషత్ ఏవో వెంకటరమణమ్మ, వ్యవసాయాధికారి లక్ష్మి మినహా ఇతర శాఖల అధికారులు హాజరు కాలేదు. అధికారులే డుమ్మా కొడితే సమస్యలు ఎవరికి చెప్పు కోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు గ్రీవెన్స్‌డే నిర్వహణ పట్ల శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

**● వెంకటాచలం :** రెవెన్యూ సమస్యలపై గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కారిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెవెన్యూ సమస్యలపై బాధితుల నుంచి రెండు ఫిర్యాదులు అందాయి. రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సరిచేయాలని ఇద్దరు రైతులు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఉదయం 10.20 గంటల ప్రాంతానికి ఇద్దరు రైతులు (ఫిర్యాదుదారులు) రాగా వచ్చిన 40 నిమిషాల్లో సమస్యను తహసీల్దారుకు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. తాగునీరు, కుర్చీలు మొదలైన అన్ని వసతులు ఏర్పాటు చేశారు. అయితే కేవలం రెండు ఫిర్యాదులు మాత్రమే అందడం గమనార్హం.

## దళితవాడలో 'సుపరిపాలనలో తొలి అడుగు'



కరపత్రాలు అందిస్తున్నటీడీపీ నేతలు

మనుబోలు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని తిరుపతిపార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభు త్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలుగుతమ్ముళ్ళు వివరించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి రాయపాటి కిరణ్, ఎస్సీసెల్ మండల కన్వీనర్ చింతల వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జి కలికి రమేష్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, ప్రభాకర్‌రావు, అంకయ్యగౌడ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి



శిక్షణ ఇస్తున్న ఏఎస్‌వో రఫీ మొహిద్దీన్

మనుబోలు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమీషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం బీఎల్‌వోలు ఇంటింటా ఓటు సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాల యంలో సోమవారం మండలంలోని 42 మంది బీఎల్‌వోలకు ఓటు నమో దుపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. పొదలకూరు ఏఎస్‌వో రఫీ మొహిద్దీన్ అన్నా రీ బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వోలు ప్రతీ ఇంటికి వెళ్ళి యాప్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే ఓటర్లు ఎంతమంది ఉన్నా రు? వారికి కార్డులు ఉన్నాయా? కొత్త ఓటర్లతో పాటు చనిపోయిన ఓటర్ల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

# ప్రసన్న వ్యాఖ్యలు సిగ్గుచేటు

### నార్తురాజుపాలెంలో మహిళల ర్యాలీ




ర్యాలీలో పాల్గొన్న మహిళలు

కొడవలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్ రెడ్డి చేసి న అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటని మహిళలు, టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నార్తురాజుపాలెం గ్రామంలో హైస్కూల్ నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మహిళలను కించపరిచే అలవాటు వైసీపీకే ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి తన సొంత చెల్లి అని కూడా చూడకుండా పలువురిచే కించపరిచేట్లు మాట్లాడించారని ఆరోపించారు. అనంతరం టీడీపీ నాయకులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, కరకటి మల్లికార్జున, మందిపాటి ప్రవీణ్‌కుమార్ రెడ్డిలు మాట్లా డుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఎం తో కృషి చేస్తున్నారని, ఆమెకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వ్యక్తిగత దూషణలు చేశారని అన్నారు. గత ఐదేళ్ల పాలనలో ప్రసన్న కుమార్ రెడ్డి గ్రావెల్, ఇసుక, మట్టి, ధాన్యం, మద్యం మాఫియాలకు నియోజకవర్గాన్ని అడ్డాగా మార్చారన్నారు. రూ. కోట్లలో ప్రజా ధనాన్ని దోచు కున్నారని ఆరోపించారు. నేడు నియోజకవర్గంలో మారు మూల గ్రామాలను సైతం ఎమ్మెల్యే ప్రశాంతి పట్టణాలకు దీటుగా అభివృద్ధి పరుస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో నార్తురాజుపాలెం వైసీపీ నాయకుడు నిండు గర్భిణీపై దాడి చేయించాడని, మహిళలను కించపరిచే సంప్రదాయం వైసీ పీదేనని మండిపడ్డారు. వైసీపీ నేతలు చేసిన అరాచకాలు, అక్రమాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు గరికపాటి రాజజేంద్రకుమార్, పాటూరు రమేష్, వెంకటరమణా రెడ్డి, చెక్కా మదన్, బద్వేలు వినీల్ రెడ్డి, పల్లంరెడ్డి సురేష్ రెడ్డి, తువ్వర ప్రవీణ్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కావలిలో సీపీఎం ధర్నా

కావలి(టౌన్), జూలై 14(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లకు వ్యతిరే కంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ ఈఈ కార్యాల యం వద్ద ధర్నా చేసి ఈఈకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ పెంచిన కరెంటు చార్జీలు తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రూ.16 వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపిందని ఆరోపించారు. పెంచిన కరెంటు చార్జీలు కట్టలేక బాధపడుతున్న ప్రజలకు స్మార్ట్ మీటర్ల బిగింపు మరింత ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలని, లేనిపక్షంలలో ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

### గణేష్ నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

కావలి : కలుగోళ్లశాంభవి ఆలయ ప్రాంగణంలో 9వ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆగస్టు 27వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వహకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో సదరన్ చానల్ వంతెన

**● పొంచి ఉన్నప్రమాదం ● పట్టించుకోని అధికారులు**



శిథిలస్థితిలో ఉన్న సదరన్ కాలువపై ఉన్న వంతెన



కుంగిన సదరన్ కాలువ వంతెన రహదారి

సంగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం వద్ద ఉన్న సదరన్ చానల్ మీద ఉన్న మూడవ వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నారెడ్డిపాళెం గ్రామం సంగం మండల కేంద్రానికి తూర్పువైపు 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి కూతవేటు దూరంలో బుచ్చిరెడ్డిపాళెం ఉంది. దీంతో అన్నారెడ్డిపాళెం గ్రామస్థులు ఎక్కువగా దగ్గరలో ఉన్న బుచ్చిరెడ్డిపాళెం వైపు ప్రతి పనికి వెళతారు. సంగం మండల కేంద్రానికి రావాలన్నా బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లి అక్కడి నుంచి బస్సులో సంగం వస్తారు. అయితే అన్నారెడ్డిపాళెం బుచ్చిరెడ్డిపాళెంల మధ్య సదరన్ చానల్ ప్రవహిస్తుంది. ఈ కాలువను సుమారు 140 ఏళ్ల కిందట నిర్మించారు. ఈ కాలువ రిజర్వాయర్ నుంచి ప్రారంభమై సుమారు 9 కిలోమీటర్లు ప్రవహించి కోవూరు డ్రైన్‌లో కలుస్తుంది. సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసేందుకు దీన్ని నిర్మించారు. ఈకాలువ నిర్మాణ సమయంలో అన్నారెడ్డిపాళెం గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు ఏక వరుసలో వంతెన నిర్మించారు. అయితే ఈ వంతెన నిర్మించి శతాబ్దం పైబడడంతో శిథిలావస్థకు చేరింది.

## C.R.I.M.E N.E.W.S

## అదృశ్యమైన యువకుడి హత్య

- పెన్నాతీరంలో దారుణం
- స్నేహితులే హతమార్చినట్లు అనుమానాలు
- మిస్సింగ్ కేసును ఛేదించిన రూరల్ పోలీసులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ డీఎస్పీ ఘట్టమనేని, సీఐ రామకృష్ణారెడ్డి



హత్యకు గురైన మోహన్‌చందు (ఫైల్)

నెల్లూరు రూరల్/పొదలకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు అదృశ్యమయ్యాడన్న ఫిర్యాదుతో మొదలైన రూరల్ పోలీసుల దర్యాప్తు హత్యాసంఘటనతో వెలుగులోకి వచ్చింది. రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు వివరాలు, నెల్లూరు రూరల్ మండల పరిధిలోని యలమవారిదిన్నెకి చెందిన కాయల మోహన్‌చందు (21) ఐదు రోజులుగా కనిపించడం లేదని, అతని అన్న డేనియల్‌రాజు ఆదివారం ఫిర్యాదుచేశారు. దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు అతడితో వివాదాలున్న పొదలకూరు మండలం విరువూరుకి చెందిన తరుణ్‌కుమార్‌రెడ్డిపై అనుమానం కలిగింది. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో వివాదాలు ఉండటం, తరుణ్ భార్య అతడితో విడిపోయి ఉండటంతో ఆమెతో మోహన్ మాట్లాడుతున్నాడేమోనన్న అనుమానం తదితర విషయాలపై ఇరువురి మధ్య వివాదాలు జరుగుతుండేవి. ఈ క్రమంలో చర్చల కోసం మోహన్‌చందును తన ఊరికి పిలిపించుకున్న తరుణ్ ఈ నెల 9న అర్ధరాత్రి ఊరిపక్కనున్న పెన్నా పొర్లుకట్ట ప్రాంతమైన ప్రగతినగర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ తరుణ్ స్నేహితులైన సోమశేఖర్, సురేష్, శ్రీధర్‌ల సాయంతో కత్తితో పొడిచి, గడ్డపారతో కొట్టి హతమార్చాడు. ఈనేపథ్యంలో తరుణ్‌ను సోమవారం అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయని సీఐ తెలిపారు. మోహన్‌చందును హతమార్చిన అనంతరం అక్కడే గొయ్యితీసి పూడ్చినట్లు నిందితుడు తెలిపారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కాగా, ఈ కేసు విషయమై నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు మాట్లాడుతూ గతంలో మోహన్‌చందుకు తరుణ్‌కి మధ్య ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షలు ఉన్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం కార్ల కొనుగోలు విషయమై కూడా విభేదాలు తలెత్తినట్లు ఆయన వివరించారు. ఈనేపథ్యంలో ఈ హత్య జరిగిందన్నారు. పొదలకూరు తహసీల్దారు శివబాలకృష్ణయ్య, రూరల్, పొదలకూరు సీఐలు, ఎస్‌ఐలు, వైద్యుల ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సంగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు గ్రామంలో పి శ్రీనివాసులు (50) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులిద్దరికీ వివాహాలయ్యాయి. ప్రస్తుతం భార్యాభర్తలు మాత్రమే ఉంటున్నారు. ఈక్రమంలో శ్రీనివాసులు ఆదివారం రాత్రి సమీపంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. అయితే ఎంతసేటికీ రాకపోవడంతో చుట్టుపక్కల వారికి భార్య తెలిపింది. దీంతో వారు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఎక్కడికైనా వెళ్లాడనుకున్నారు. కానీ సోమవారం రాత్రి 7గంటల సమయంలో చెరువు వద్దకు వెళ్లిన వారికి ఒడ్డున శవం తేలాడుతుండడంతో అనుమానం వచ్చి పరిశీలించగా శ్రీనివాసులుదిగా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీసి పోసుమార్టంకు తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

### ● కలిగిరిలో యువకుడు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

కలిగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరనకొల్లు గ్రామ పొలాల్లో నూతన పెట్రోల్‌బంకు సమీపంలో సోమవారం గుర్తుతెలియని యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రైతులు పొలాల్లో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. మృతుని కుడిచేతికి ఓపక్క తెలుగులో సత్యవతి అని, మరో పక్క వంశీ-కల్యాణి అని ఇంగ్లీషు అక్షరాలు, మధ్యలో సింహం బొమ్మ ఉన్నాయని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ● చికిత్స పొందుతూ యువకుడు..

నెల్లూరు(క్రైం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని కోటమిట్టకు చెందిన జలీల్(32), రేష్మ దంపతులు. వారికి ముగ్గురు సంతానం. కొద్ది రోజులుగా వారి మధ్య విభేదాలు నడుస్తున్నాయి. ఈ నెల 9న రాత్రి రేష్మ పిల్లలను తీసుకుని ఖుద్దూస్‌నగర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలోనే జలీల్ తనకు చనిపోవాలని ఉందంటూ భార్యకు ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో రేష్మ అన్నదమ్ములతో కలిసి హుటాహుటిన భర్త ఇంటికి వెళ్లింది. ఇంటి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా, రాకపోవడంతో పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. జలీల్ ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో జలీల్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు ఈ నెల 11న చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు.ఈ మేరకు మృతుడి బావమరిది షేక్ సికిందర్ సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కర్నాటక బ్యాంకులో అగ్నిప్రమాదం



బ్యాంకులో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నెల్లూరు(క్రైం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బృందావనంలో ఉన్న కర్నాటక బ్యాంక్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారుల సమాచారం మేరకు, బృందావనంలో ఉన్న కర్నాటక బ్యాంకు ఇన్వర్టర్, బ్యాటరీ రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బ్యాంకులో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, బ్యాంకు అధికారులకు సమాచారం అందించారు. లీడింగ్ ఫైర్‌మన్ బాలాజీగురుప్రసాద్ నేతృత్వంలో కే. చంద్రశేఖర్, మల్లికార్జున, మధు ఫైరింజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. లేకుంటే భారీగా నష్టం వాటిల్లేది. బ్యాంకు జీఎం సీహెచ్ సతీష్ నుంచి అగ్నిమాపక సిబ్బంది ప్రమాద వివరాలు సేకరించారు.ఈ ప్రమాదంలో రూ.3.5 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు ఫైర్‌సిబ్బంది పేర్కొన్నారు.

**చికెన్ ధరలు**
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 116 |
| స్కిన్ చికెన్ | 210 |
| స్కిన్‌లెస్ | 234 |

కోడిగుడ్ల ధర (100): 515



## తనికెళ్ల భరణికి జన్మదిన శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 14 (ఆంధ్రజ్యోతి) : చలన చిత్రనటుడు, రచయిత, తనికెళ్ల భరణి జన్మదినం సందర్భంగా సోమవారం నెల్లూరుకి చెందిన అభిమానులు ఆయనకు హైదరాబాద్‌లో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కళాకారులు తరపున కళారత్న దోర్నాల హరిబాబు, బాలాజీనగర్ నందాప్రశాంత్, సురేష్ తనికెళ్ల భరణిని శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**న్యూస్ బాక్స్**

### కార్పొరేషన్ పీజీఆర్‌ఎస్‌కి 57 అర్జీలు

నెల్లూరు(సిటీ), జూలై 14,(ఆంధ్రజ్యోతి): నగర కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కి 57 మంది తమ సమస్యలపై వినతిపత్రాలు అందచేశారు. పారిశుధ్యం, గృహనిర్మాణం, సిటీ ప్లానింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు వినతులు అందచేశారు. డీసీ చెన్నుడు, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌వో చైతన్య అర్జీలు స్వీకరించారు. వాటిని నిర్దీత కాలవ్యవధిలోపు పరిష్కరించాలని ఆదేశించారు. కాగా సంతపేటలోని బుజ్జమ్మరేవు వద్ద పంప్‌హౌస్‌ను కమిషనర్ నందన్ పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

### ఏబీవీపీ నగర కమిటీ ఎంపిక

నెల్లూరు(విద్య), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఏబీవీపీ నగర కమిటీ ఎంపికైంది. నగరంలోని ఓ కళాశాలలో సోమవారం జిల్లా ప్రముఖ్ గంగాధర్ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నగర కార్యదర్శిగా కే.మౌనిష్, సహాయ కార్యదర్శులుగా ఆదిత్య, మదన్, సుజిత్, వీరశంకర్, జోన్ ఇన్‌చార్జిలుగా గణేష్, మనోహర్, మనోజ్, హాస్టల్స్ కన్వీనర్‌గా జీ.సుకుమార్, ఎస్‌ఎఫ్‌డీ కన్వీనర్‌గా జగదీష్, ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్‌గా కొండయ్య, ఖేలో భారత్ కన్వీనర్‌గా అమర్నాథ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా రాబర్ట్, కార్యవర్గ సభ్యులుగా లోకేష్, శంకర్, శ్యామ్, గౌరీశంకర్‌లు ఎంపికయ్యారని జిల్లా ప్రముఖ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు విభాగ్ సంఘటనా కార్యదర్శి భరత్‌కుమార్, జిల్లా కన్వీనర్ హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా క్రీడాకారులకు అంతర్జాతీయ చెస్ రేటింగ్

నెల్లూరు(విద్య), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) ప్రచురించిన రేటింగ్ జాబితాలో జిల్లాకు చెందిన ఏడుగురు క్రీడాకారులు స్థానం పొందారని రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. నగరంలోని గోమతి నగర్ ఆర్ఎల్ చెస్ అకాడమీలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బెంగళూరు, హైదరాబాద్, అనకాపల్లిలో జరిగిన అంతర్జాతీయ చెస్ రేటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభతో ఆటను ప్రదర్శించి విజయాలు సాధించారన్నారు. ఈ విజయాలతోనే వారు ఫిడే చెస్ రేటింగ్ క్రీడాకారులుగా గుర్తింపు పొందారన్నారు. వీరిలో కావలికి చెందిన 9 ఏళ్ల బి.సూర్యనివాస్‌తోపాటు పీ.హేమల్, వీ.హరేంద్రరెడ్డి, పీ.జేనిషా, ఏ.ప్రీతమ్, ఎన్.జితేంద్రరెడ్డి, సీహెచ్ తరుణ్‌కుమార్ ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరక్టర్స్ రామ్-లక్షణ్, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పెన్నా వంతెనకు మొక్కల ముప్పు




పెన్నానదిపై ఉన్న వంతెనకు కొత్త ముప్పు వచ్చి పడింది. ఈ వంతెనకు అటూ,ఇటూ ఉండే గోడలపై రావి మొక్కలు మొలిచి, పెద్ద వృక్షాలుగా మారాయి. వీటి వేర్లు బాగా లోపలికి చొచ్చుకుపోయాయి. అందువల్ల వంతెన గోడలు పలుచోట్ల బీటలు వారాయి. కొన్నిచోట్ల దెబ్బతిన్నాయి. ఫలితంగా వంతెన బలహీనపడే అవకాశాలు ఉన్నాయని స్థానికులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. వీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించి, మళ్లీ మొలవకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు.










నగరంలో పెన్నా నదిపై ఉన్న పాత వంతెన మీద పెరుగుతున్న మొక్కలు

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

## డ్రోన్ చూస్తోంది!

- నగర శివార్లలో నేరాలపై నిఘా నేత్రం
- ఓపెన్ డ్రింకింగ్, పేకాట స్థావరాల అన్వేషణ
- అనుమానాస్పద ప్రాంతాలపై జల్లెడ



నెల్లూరురూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి) : తరుచూ పేకాట నిర్వహణ.. నిత్యం బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాలు... సహజ వనరుల అక్రమ తవ్వకాలు... అనుమానాస్పద ప్రాంతాలపై డ్రోన్లతో నిఘా పెట్టి ఇట్టే పసికట్టేస్తున్నారు. చిన్న అలజడి రేగినా సరే నిఘా నేత్రాన్ని ఆకాశంలోకి పంపి జల్లెడ పడుతున్నారు.

నగరానికి ఆనుకుని ఉన్న రూరల్లో నేరస్థుల అలజడి ఎక్కువగా ఉందనే సమాచారం పోలీసులకు అందుతోంది. పైగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. అనుమానాస్పద ప్రాంతాల్లో ఘర్షణలు జరుగుతోన్నాయి. సహజ వనరులను దోచుకుని రహస్య మార్గాల ద్వారా సంపదను తరలింపు కూడా ఎక్కువే. వీటన్నింటిని కట్టడి చేసేందుకు నెల్లూరురూరల్ పోలీసులు వ్యూహాత్మకంగా డ్రోన్లను రంగంలోకి దింపారు. పట్టపగలు బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతంగా ప్రఖ్యాతిగాంచిన పద్మావతి గ్రీన్‌సిటీ దాదాపుగా కట్టడికి వచ్చింది. ఇక్కడ ప్రతి రోజు దర్శనమిచ్చే మందుబాబుల అలజడి ఘననీయంగా తగ్గింది. ఇదే తరహాలో ఉన్న కల్లూరిపల్లి, గుండ్లపాళెం, వావిలేటిపాడు, అల్లీపురం టిడ్కో సముదాయం, కొండ్లపూడి టిడ్కో ప్రదేశం పోలీసుల అదుపులోకి వచ్చాయి. దొంతాలి, కొమ్మరపూడి ప్రాంతాల్లో విహరించే ప్రేమ జంటలను సైతం కట్టడి చేశారు. ఇక ఖాళీ లేఅవుట్లలో రెగ్యులర్‌గా జరిగే పేకాట స్థావరాలన్నీ గుట్టుచప్పుడు కాకుండా గమ్యాలను మార్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లోని పంటపొలాలు, చెట్ల చాటున జరుగుతున్న జూదాలన్నీ దాదాపుగా మాయమయ్యాయి.

**● సహజవనరుల దోపిడీకి అడ్డుకట్ట**

రూరల్లోని పలు ప్రాంతాల్లో కాలువలు, చెరువులు, గుంతలు, తిప్పలు లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు సహజవనరులను దోచుకోవడం మొదలుపెట్టారు. వీరందరిని కట్టడి చేసేందుకు పోలీసులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. దీంతో సహజవనరుల దోపిడీ కూడా దాదాపుగా అదుపులోకి వచ్చిందని పోలీసులు చెబుతున్నారు.

**నేరాల కట్టడికి పర్యవేక్షణ**

నెల్లూరు రూరల్ ప్రాంతమంతా నగరానికి ఆనుకుని ఉండటం వల్ల నేరాలు జరిగే అవకాశాలున్నందున డ్రోన్లతో నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఓపెన్ డ్రింకింగ్, పేకాట, కోడి పందేలు, ఇతర జూదాలు వంటివి దాదాపుగా అదుపులోకి వచ్చాయి. అనుమానాస్పద ప్రాంతాల్లో రోజూ డ్రోన్లతో నిఘా పెట్టాం. చిన్న అలజడి సమాచారం వచ్చినా డ్రోన్లను పంపుతున్నాం. ఎప్పటికప్పుడు డ్రోన్లతో పర్యవేక్షిస్తూ నేరాలను కట్టడి చేస్తున్నాం.

- గుంజి వేణు, సీఐ, నెల్లూరురూరల్





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

## కార్యకర్తల కృషి వల్లే మొదటిస్థానం

నెల్లూరు రూరల్, జూలై 14,(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ నిర్వహణలో రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచిందని, అందుకు కార్యకర్తల కృషే కారణమని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటు మున్సిపల్ డివిజన్లు, అటు గ్రామాల్లోని క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూతు కన్వీనర్లు, కో కన్వీనర్లు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయడం వల్లే ఈ గుర్తింపు లభించిందన్నారు. అన్నీ పనులు పక్కనపెట్టి తొలిఅడుగు కార్యక్రమంపైనే దృష్టి సారించామన్నారు. పదవులు వచ్చాయని, అధికారంలో ఉన్నామని, ఐదేళ్లకొకసారి ప్రజలకు దగ్గరకెళ్లి దండం పెడతానంటే కుదరదని, నిత్యం ప్రజల్లో ఉంటేనే నాయకుడిగా గుర్తిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల్లో తిరగండి, నాయకులుగా ఎదగండి.. అంటూ కార్యకర్తలకు పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజానాయుడు, కమలాకర్‌రెడ్డి, భానుశ్రీ, సాబీర్‌ఖాన్, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### మునీర్ బాషాకు సన్మానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : 36వ డివిజన్ 125వ బూత్ టీడీపీ నాయకుడు షేక్ మునీర్ బాషాను సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సన్మానించారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి సంబంధించి ఆ బూత్‌లో నూరుశాతం లక్ష్యాన్ని పూర్తి చేసినందుకుగాను ఆయన్ను సన్మానించారు.



వినతిపత్రం ఇచ్చి అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

## కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), జూలై 14,(ఆంధ్రజ్యోతి) :తమ డిమాండ్లు పరిష్కరించాల ని ఇంజనీరింగ్ విభాగంలో ని పారిశుధ్య కార్మికులు సోమవారం కూడా ఆందో ళన కొనసాగించారు. ఇందులో భాగంగా ఎస్ ఎంసీ ఎదుట నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. అనంతరం ము న్సిపల్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పెంచల నరస య్య, కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులకు జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించా లని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించి, వారసులకు ఉద్యోగ అవ కాశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

### భూఆక్రమణపై విచారణ జరపండి

నెల్లూరురూరల్, జూలై 14,(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టేంపాడులో భూమిపై ఎలాంటి హక్కులు లేని వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకుని టెంకాయమొక్కలు నాటుతూ, గెస్ట్‌హౌస్ నిర్మించుకుంటున్నాడని సీపీఎం నాయకులు నెల్లూరురూరల్ తహసీల్దారుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు తిరుపాలు, జనార్దన్ మాట్లాడుతూ సదరు భూమిపై ప్రభు త్వం నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నా, సదరు వ్యక్తి భూముల్లోకి వచ్చి ఆక్రమణలకు పాల్పడుతున్నాడని, రెవెన్యూ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫుడ్ ఎలా ఉంది?

**హోటళ్లలో ఆహార భద్రతాధికారుల తనిఖీలు**



నెల్లూరు(సిటీ), జూలై 14,(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతలో తలెత్తుతున్న లోపాలను అరికట్టేందుకు ఆహార భద్రతశాఖకు చెందిన అధికారులు నెల్లూరులోని పలు హోటళ్లలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆశాఖ సహాయ కంట్రోలర్ జీ వెంకటేశ్వరరావు నేతృత్వంలోని బృందం తొలత మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న మురళీకృష్ణ హోటల్లో తనిఖీ చేశారు. అక్కడ పెరుగు, రసం సమూనాలను సేకరించారు. అనంతరం వంటశాల ను, ఆహారంతినే ప్రదేశాలను పరిశీలించారు. ఆహారం 60 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పుడే వినియోగదారులకు వడ్డించాలని సిబ్బందికి సూచించారు. స్టోర్ రూములో నిల్వలపై డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ వద్ద ఉన్న లక్ష్మీశ్రీనివాస భవన్‌లో తనిఖీలు చేపట్టారు. అక్కడ వంటశాల, స్టోరు గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని, వాటిని 14 రోజుల్లో బాగు చేయాలని నోటీసులు జారీ చేశారు. పామోలిన్, పెరుగు నమూనాలు సేకరించారు. తదుపరి మాగుంట లేఅవుట్‌లోని రాయలసీమ రుచులు హోటల్లో తనిఖీ చేపట్టిన అధికారులు చికెన్ బిర్యానీ, సాంబార్ నమూనాలను సేకరించారు. వనంతోపుట సెంటర్‌లోని సికిందర్ బిర్యానీ హౌస్‌లో చికెన్ బిర్యానీ, బాదంపాల నమూనాలను సేకరించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. సేకరించిన నమూనాలన్నింటినీ లేబొరేటరీకి పంపి, వచ్చే ఫలితాల ఆధారంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఆ శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో లిఫ్ట్ కష్టాలు

- మరమ్మతులతో పనిచేయని వైనం
- బాలింతలు, గర్భిణుల పరిస్థితి దారుణం
- జనవరి నుంచి టెండర్లు పిలవని ప్రభుత్వం



ప్రసూతి, చిన్న పిల్లల ఆసుపత్రిలో లిఫ్ట్‌కు అడ్డంగా కుర్చీలు

నెల్లూరు (వైద్యం) జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)కి వచ్చే రోగులకు కష్టాలు తప్పటం లేదు. వారికి మౌళిక సదుపాయాల కల్పనలో నిర్వాహకులు వైఫల్యం చెందుతున్నారు. ప్రధానంగా రోగులను వార్డులకు చేర్చే లిఫ్ట్‌లు చెడిపోయాయి. ఒకటి, రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. పోనీ స్ట్రెక్చర్లు, వీల్‌చైర్‌లు అయినా అందుబాటులో ఉన్నాయంటే తగినన్ని లేవు. పైగా వాటిని స్టాఫ్‌నర్సులు రికార్డులు, ఇతర సామాన్లు తీసుకు వెళ్లేందుకు వాడుతున్నారు. దీంతో రోగుల వెంట వచ్చిన సహాయకులే వారిని అతికష్టం మీద వార్డుకు తరలిస్తు న్నారు. జీజీహెచ్‌లో 750 పడకలు ఉన్నాయి. ప్రతిరోజూ 1200 మందికిపైగా ఓపీ ఉంటుంది. ఇందులో 500 మంది వరకు ఇన్‌పేషెంట్‌గా ఉంటున్నారు. ఇలాంటి వారికి అన్నీ వసతులతోపాటు లిఫ్ట్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, నిర్వహకులు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. లిఫ్ట్‌ల నిర్వహణ బాధ్యతలను జాన్సన్ కంపెనీకి అప్పగించారు. వారితో చేసుకున్న అగ్రిమెంట్ గత డిసెంబర్‌లోనే ముగిసింది. ప్రస్తుతం వారే తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా ఇందులో ఏవైనా వస్తువులు చెడిపోతే లిఫ్ట్‌లను మూలన పడేయక తప్పటంలేదు. లిఫ్ట్‌ల నిర్వహణకు ప్రభుత్వం గత జనవరి నుంచి టెండర్లు పిలవలేదు.

**● ప్రసూతి ఆసుపత్రిలో మరీ దారుణం**

జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో ఉన్న మూడు లిఫ్ట్‌లలో ఒకటి మాత్రమే పనిచేస్తున్నది. అది కూడా పూర్తి సామర్థ్యంతో పనిచేయటం లేదు. దీంతో ఇక్కడ గర్భిణులు, బాలింతలకు కష్టాలు తప్పటం లేదు. ఇక్కడ స్ట్రెక్చర్‌లు కూడా అందుబాటులో ఉండటం లేదు, వీల్‌చైర్‌లు ఇక్కడ ఉన్నా అవి గర్భిణులు, బాలింతలకు మాత్రం వినియోగించటం లేదు. ప్రసూతి, చిన్నపిల్లల విభాగాలకు ప్రతిరోజు 200 మంది రోగులు వస్తుంటారు. ప్రతిరోజు 35 ప్రసవాలు జరుగుతుంటాయి. ఇక్కడ మూడు అంతస్తులు ఉండగా లిఫ్ట్‌లే కీలకంగా మారుతుంటాయి.పది రోజులుగా లిఫ్ట్‌లు పనిచేయక పోయినా అధికారులు చర్యలు తీసుకోలేదు.

**మరమ్మతులకు ప్రాధాన్యం**



జీజీహెచ్‌లోని లిఫ్ట్‌ల మరమ్మతులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. లిఫ్ట్‌ల నిర్వహణకు సంబంధించి డీఎంఈకి సమస్యను తెలియచేశాం. ఎక్కడ లోపాలు ఉన్నాయే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నాం.

- డాక్టర్ కొండేటి మాధవి,జీజీహెచ్ ఇన్‌చార్జి, సూపరింటెండెంట్



ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేయని లిఫ్ట్‌లు

## వీబీఆర్ పుట్టినరోజు వేడుకలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం) జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురంలో సోమవారం టీడీపీ నాయకుడు, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి (వీబీఆర్) జన్మదిన వేడుక లను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు షేక్.జమీర్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ముం దుగా 53,54 డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి జహీర్ చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లు,పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు(విద్య), జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని అన్నీ డివిజన్ల నుంచి భారీగా అభిమానులు, ప్రజాప్రతినిధులు ఆయన నివాసానికి తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల ఉద్యోగులు వీబీఆర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు.



వీబీఆర్‌ను సత్కరిస్తున్న అభిమానులు

## అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి : జనసేన



వేదాయపాలెంస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు(క్రైం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సోమవారం జనసేన నాయకులు బాలాజీనగర్, వేదాయపాలెం పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేయగా, వేదాయపాలెం పోలీసులు ఫిర్యాదును పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా లాయర్ ఎస్ శ్రీరామ్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌పై తప్పుడు ఆరోపణలు, అసభ్యకరమైన పోస్టులు, వీడియోలు పెట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, తదితరులు ఉన్నారు. వేదాయపాలెంలో నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు మాట్లాడుతూ వైసీపీ రాష్ట్రనేత షేక్ మొయినుద్దీన్ జనసైనికులను గంజాయి బ్యాచ్ అనడం దుర్మార్గమన్నారు. పవన్‌కళ్యాణ్‌పై మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ ఆలియా, షేక్ కరీం, శనివారపు అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులపై విమర్శలను మీరు ఒప్పుకుంటారా..?

నెల్లూరు (వైద్యం) జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు రాజకీయాల్లో ఉంటే, వారి గురించి ఎవరైనా అసభ్యంగా మాట్లాడితే ఆయన ఒప్పుకుంటారా..? అని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ ప్రశ్నించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి అనీల్‌కుమార్ సతీమణి రాజకీయాలలోకి వచ్చి ఉంటే, ఆమెను అసభ్యకరంగా మాట్లాడితే ఊరికే ఉండే వాడివా ? అంటూ ప్రశ్నించారు. చీము, నెత్తురు ఉండే ఎవరైనా ఒప్పుకోరని అన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి క్యారెక్టర్ గురించి జిల్లా ప్రజలందరికీ తెలుసునని, ప్రశాంతమ్మపై ఆయన వ్యక్తిగత దూషణలకు దిగటం దారుణమన్నారు. అనిల్ వేమిరెడ్డి దంప తుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో మరో డిప్యూటీ మేయర్ తహసిన్ ఇంతియాజ్, కార్పొరేట ర్లు నాగమణి, మైనుద్దీన్, దేవరకొండ సుజాత, గోగుల నాగరాజు, ఆశోక్, హాజీ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్

# వామ్మో.. ఎంత పే...ద్దదో!



చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై మనుబోలు వద్ద వెళుతున్న భారీ గ్యాస్ ట్యాంకర్

ఈ చిత్రంలో కనిపి స్తున్న భారీ ట్యాంకర్‌ను ఇంతకు మునుపెన్నడూ బహుశా చూసి ఉండరేమో! ఈ ట్యాంకర్‌ను నడపడానికి డ్రైవర్ చాలా సహనం అవసరం. వేగంగా వెళితే చాలా డేంజర్. అందుకే.. పాపం.. పెళ్లి నడకలా.. అడుగులో అడుగేసుకుంటూ తరలిస్తు న్నారు. రోజుకు 10 నుంచి 15 కి.మీ దూరం మాత్రమే వెళు తుంది. దుబాయ్‌లోని కటార్‌కు ఈ భారీ గ్యాస్ ట్యాంకర్‌ను తీసుకెళ్లాల్సి ఉంది. తడ శ్రీసిటీలో బీఎస్‌ఆర్‌ఎస్ లాజిస్టిక్స్ కంపెనీ దీనిని తయారు చేసింది. చెన్నైకి చెందిన ఆర్‌కేబీ ట్రాన్స్‌పోర్ట్ అండ్ క్రేన్స్ రవాణా చేస్తోంది. ఈ ట్యాంకర్ బరువు 200 టన్నులు. అంటే రెండు లక్షల కిలోలన్నమాట. రెండు ట్రాలీలపై (202 చక్రాలతో) ఇది నడుస్తోంది. రహదారిపై గుంతలు, విద్యుత్ తీగలు, ఇతర వాహనాలను తప్పించేందుకు నిత్యం ఈ ట్యాంకర్ చుట్టూ 20 మంది రక్షణ వలయంలా ఉండాల్సిందే. ఈనెల 7న శ్రీసిటీలో బయలుదేరిన ఈ ట్యాంకర్ వారం రోజులకు మనుబోలు వద్దకు చేరుకుంది. దీనిని నిదానంగా కృష్ణపట్నం పోర్టుకు తరలించి, అక్కడినుంచి దుబాయ్‌నౌక వద్దకు చేర్చాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా జాతీయరహదారిపై పెద్ద ప్రమాదం జరగవచ్చు. అందుకే ఇటు పోలీసులు, అటు విద్యుత్ సిబ్బంది రోడ్డుకు అడ్డుగా తీగలు వచ్చినప్పుడల్లా విద్యుత్ సరఫరా నిలిపివేసి దాటిస్తున్నారు. ఈ వాహనాన్ని తిలకించిన ప్రయాణీకులు 'వామ్మో.. ఎంత పే..ద్ద ట్యాంకరో..!' అంటూ నోరెళ్ళబెడుతున్నారు. కొంతమంది తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. సెల్ఫీలు కూడా దిగడం విశేషం.

- మనుబోలు (ఆంధ్రజ్యోతి)

# నేత్ర పర్వంగా వసంతోత్సవం



నెల్లూరు (సాంస్కృతికం) జూలై 14 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం ద్రౌపదీ దేవి, పాండవులకు విశేష అలంకారంతో మాడవీధుల్లో వసంతోత్సవం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో జానకి ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

కాగా, నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పూజలు కొనసాగుతున్నాయి. నాలుగు పూటల షిరిడీ హారతులతోపాటు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర నామ పూజలు జరిగాయి. మందిరం కమిటీ చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

## బంగారు కుటుంబాలను ప్రోత్సహించాలి

● కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు(హరనాథపురం), జూలై 14(ఆంధ్రజ్యోతి): పీ-4లో కేవలం ఆర్థిక అంశాలు మాత్రమే కాకుండా బంగారు కుటుంబాలను ప్రోత్సాహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తిక్కన భవన్‌లో పీ-4పై సోమవారం అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం వారు కనీసం 500 మందిని, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌అండ్‌బీ, ఏపీఎస్‌పీ డీసీఎల్, పరిశ్రమలశాఖ, జిల్లా విద్యాశాఖ తదితరశాఖల అధికారులు వారివారి పరిధిలో కనీసం రెండువేలమందికి పైబడి మార్గదర్శకులను గుర్తించాలన్నారు. నాలుగైదు రోజుల్లో ఈ పనిపూర్తి చేయాలని ఆదేశించారు. అన్నిశాఖలు పీ-4 విధానంపై దృష్టి సారించాలన్నారు. అవసరమైన చోట స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని కోరారు.

● ఎరుకల కులవృత్తుల వారికి 90శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

## ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలి

● పీజీఆర్‌ఎస్‌లో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్‌ఎస్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని ఎస్పీ జీ. కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు జిల్లా వ్యాప్తంగా 118 మంది ఫిర్యాదుదారులు తరలివచ్చి వారి సమస్యలు ఎస్పీకి తెలియజేశారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో మోసగాళ్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ ఎస్పీని కోరారు. నగరంలో ఎన్నోఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎంతో హుందాగా జరుగుతుందని, అయితే కొంతమంది మోసగాళ్లు, చీడపురుగులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్రవేశించి ప్రజలను నిట్టనిలువునా మోసం చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

# పల్లె ఫేస్ మారేనా?

- గ్రామాలకు త్రీఫేస్ కరెంటు ఎప్పటికో!
- నిరంతరాయ సరఫరాకు ఆర్‌డీఎస్‌ఎస్
- రెండేళ్లుగా నత్తనడకన పనులు
- రాష్ట్ర ప్రభుత్వ ఫోకస్‌తో వేగవంతం

నెల్లూరు (జడ్పీ), జూలై 13 (ఆంధ్రజ్యోతి): పల్లెలకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి నిర్దేశించిన పథకం పనులు రెండేళ్లుగా సా....గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఇటు గృహాలకు, అటు వ్యవసాయానికి సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్లే ఉన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా వ్యవసాయానికి ఇచ్చే 9 గంటల విద్యుత్ సరఫరా సమయంలో లైన్లను మార్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమస్యను పరిష్కరించి నగరాలు. పట్టణాల్లో వలే పల్లెల్లోనూ గృహాలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలన్న ఆలోచనతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంపిణీ రంగ పునరుద్ధరణ పథకం (ఆర్‌డీ ఎస్‌ఎస్) ద్వారా గ్రామాల్లో త్రీఫేస్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాయి.

● రూ.400 కోట్లతో పనులు

జిల్లాలో రూ.400కోట్లతో త్రీఫేస్ పనులను 2022 సెప్టెంబరులో ప్రారం భించారు. గ్రామాల్లో వ్యవసాయ ఫీడర్లను, గృహాలకు ఇచ్చే ఫీడర్లను వేరు చేసి, గృహాలకు త్రీఫేస్ ద్వారా 24గంటలు సరఫరా అందించే విధంగా ఈ పథకానికి రూపకల్పన చేశారు.

జిల్లాలోని గ్రామాల్లో 336 ఫీడర్ల పరిధిలో ఈ పథకం ద్వారా 2821 కి.మీ. 11 కేవీ లైను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1400 కి.మీ. వరకు లైను వేశారు. అలాగే ఎల్‌టీ 5 వైర్ల లైన్లు 1117కి.మీ వేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 200 కి.మీ వేయగలి గారు. ఇక, ఎల్‌టీ 3 వైర్ల లైన్లు 771కి.మీ ఏర్పాటు చేయాల్సి ఉండగా 100కి.మీ మాత్రమే వేశారు. 100 కేవీ ట్రాన్స్‌పార్మర్లు 1050 ఏర్పాటు చేయాల్సి ఉండగా 156 మాత్రమే ఏర్పాటు చేశారు. 63 కేవీ ట్రాన్స్‌పార్మర్లు 1529 ఏర్పాటు చేయాల్సి ఉండగా 210 మాత్రమే అమర్చారు. 25 కేవీ ట్రాన్స్‌పార్మర్లు 1324 అమర్చాల్సి ఉండగా 149 మాత్రమే బిగించారు. ఇవికాక విద్యుత్ స్తంభాలు కూడా పెద్దఎత్తున వేయాల్సి ఉంది. అయితే పనులు నత్తనడకన సాగడంతో గ్రామీణుల్లో అసంతృప్తి నెలకొంది. మరో వైపు, మండుతున్న ఎండలకు పల్లెల్లోనూ ఏసీల వినియోగం అధికమైంది. కానీ, సింగిల్ ఫేస్ కరెంటుతో తగినంత విద్యుత్ సరఫరా లేక పల్లెల్లో ఏసీలు పనిచేయడం లేదు. ఈ క్రమంలో త్రీఫేస్ పనులు త్వరగా పూర్తవుతాయని, తమకు కూడా పట్టణ, నగరవాసుల్లాగా విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావించిన పల్లెవాసులకు నిరాశే మిగిలింది.



కోవూరు మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన త్రీఫేస్ విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్

● రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

గత రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ల పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించి ఇటీవల సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో ఆర్‌డీఎస్‌ఎస్ పథకం పనులు పుంజుకోనున్నాయి.

**మార్చికల్లా పూర్తిచేసేలా చర్యలు**

జిల్లాలో జరుగుతున్న త్రీఫేస్ విద్యుత్‌లైన్ల పనులను మరింత వేగ వంతం చేశాం. వచ్చే ఏడాది మార్చికల్లా పనులను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అనుగుణంగా శరవేగంగా పనులు చేయిం చేలా చర్యలు తీసుకుంటున్నాం.

- పరంధామయ్య, ఈఈ

## జిల్లాకు 1,850 మెట్రిక్ టన్నుల యూరియా

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



పడుగుపాడు రైల్వే స్టేషన్‌లో యూరియా దిగుమతిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

కోవూరు, జూలై14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరఫరా చేసేందుకు పడుగుపాడు రైల్వేస్టేషన్‌కు 1850 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి తెలిపారు. పడుగుపాడు రైల్వేస్టేషన్ నుంచి దిగుమతి చేస్తున్న యూరియాను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ సంస్థ, రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయసహకార పరపతి సంఘాల ద్వారా 1000 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల ద్వారా 850 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలకు 47,588 మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటికే 32714 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. జిల్లాలో 1,50,000 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నట్లు వివరించారు. కోవూరు, నెల్లూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో వరిపైరు చిరుపొట్ట దశకు చేరుకుందన్నారు. కావలి, పొదలకూరు, ఆత్మకూరు డివిజన్లలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. ఎకరాకు 4 నుంచి 5 బస్తాల యూరియా వాడుతున్నందు వల్ల తెగుళ్లు, పురుగులు ప్రబలే అవకాశముందన్నారు. సాగు ఖర్చు అధికమౌతుందని చెప్పారు. సూక్ష్మ పోషకాల లోపం వల్ల దిగుబడులు తగ్గే అవకాశముందన్నారు. ఆమె వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత ఉన్నారు.

## 19న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు(విద్య), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఈనెల 19వ తేదీన అండర్-11, 13, 15, 17, 19 సింగిల్స్, డబుల్స్, మెన్, ఉమెన్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో ఈనెల 17లోగా స్టేడియంలో వారి పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

## ఆలయాల భూముల కౌలు వేలం

కొండాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): కొండాపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, రేణుమాలలోని కోదండ రామస్వామి ఆలయాలకు చెందిన భూములను ఏడాదిపాటు కౌలుకు కేటాయించేందుక సోమవారం దేవాదాయ శాఖ ఆధికారులు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈవో శాంతయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం కార్యక్రమంలో రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 26.70 ఎకరాల భూమిని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది రైతులు రూ.1.15 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అలాగే రేణుమాల ఆలయానికి సంబంధించిన 45.27 సెంట్ల భూమిని 5 మంది రైతులు రూ.2.88 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, అధికారులు పాల్గొన్నారు.



వేలంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

## బౌద్ధ భిక్షువులు ఆశ్రమాల సందర్శన

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆశ్రమాలను సోమవారం విదేశీ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ధర్మాచరణ తగ్గుతోందని, ఆరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. ఇందుకు విరుగుడుగా ప్రజలంతా మౌనం, ధ్యానం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీలంక నుంచి కోవానే పాలితథెరో, జపాన్ నుంచి షిమాడా, భారత్‌కు చెందిన బోధి హీస్‌లు జిల్లాలోని పలు ఆశ్రమాలను సందర్శించారు. అనంతరం వారు ఇందు కూరుపేట మండలం కొత్తూరులోని భర ద్వాజ దత్త పీఠాన్ని సందర్శించి, పీఠం నిర్వాహకులు మహేష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి పొగతోటలోని ఆదిశంకరా ధ్యాన మందిరాన్ని సందర్శించారు. పొదలకూరురోడ్డు కొత్తూరు భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమానికి చేరుకున్నారు. . ఆవరణంలో బిల్వ, రావి మొక్కల ను నాటారు. ఈ కార్యక్రమాలలో పర్వతస్వామి, జగదీశ్వర, చంద్రశర్మ, మణిశంకర్, సునీల్‌కుమార్, ప్రవీణ్ కుమార్, నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధ బిక్షువులతో మాట్లాడుతున్న మహేష్ స్వామి

### నేడు అవగాహన సదస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యల పరిష్కారంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులంతా పాల్గొనాలని కోరారు.

## కరేడులో భూసేకరణ విరమించుకోవాలి

● సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వామపక్షాల నేతలు, గిరిజన రైతుల ధర్నా

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏడాదికి మూడు పంటలు పండుతూ పచ్చగా కళకళలాడే కరేడులో ఇండోసోల్ కంపెనీ కోసం భూసేకరణ చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణం విరమించుకోవాలని, భూసేకరణ ప్రకటన రద్దు చేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిరిజన రైతులతో కలసి స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ పార్టీల నాయకులు మాట్లాడుతూ మా ప్రాణాలైనా ఇస్తాం.. భూములు ఇవ్వమని గ్రామంలోని ప్రజలంతా ముక్తకంఠంతో అధికారుల సమక్షంలో చెప్పడమే గాక భూములు ఇవ్వబోమని ఏకగ్రీవంగా గ్రామసభ తీర్మానం కూడా చేశారన్నారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రజా వ్యతిరేకతను గుర్తించకుండా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లాలని ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటనను, అవాంఛనీయ పరిణామాలను ఎదుర్కోవల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులకు మద్దతుగా కమ్యూనిస్టు పార్టీలు ఎంతదూరమైనా పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించకపోతే వారు తగినబుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల మనోభావాలను, గ్రామసభ తీర్మానాన్ని ప్రభుత్వానికి తెలియజేశామని, ప్రభుత్వంలో చర్చించిన అనంతరం ఆ విషయాలను ప్రజలకు తెలియజేస్తామని, ప్రజాసంఘాల నాయకులతో కూడా ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసి ప్రభుత్వ ఉద్దేశ్యాలను వివరించటం జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో ఆయా పార్టీల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పీ.మాలకొండయ్య, జీవీబీ కుమార్, బీ.సురేష్‌బాబు, ఆర్.మోహన్, హుస్సేన్, ఆనంద్‌మోహన్, కే.నాంచార్లు, దువ్వూరి జాన్, కత్తి సుజాత, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు, కరేడు గిరిజన రైతులు

## పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి

● యువకుడి వీపుపై తీవ్ర గాయాలు ● కౌలు డబ్బుల విషయంలో ఇరువురి మధ్య వివాదం

లింగసముద్రం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కౌలు డబ్బులు విషయమై ఏర్పడిన వివాదం ఇరువురి మధ్య కక్షలకు దారితీసింది. ఈ క్రమంలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేసి వీపుపై నరికిన ఘటన మండలంలోని మొగిలిచెర్లలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చుండూరు పోతులూరయ్యకు చెందిన సాగు భూమిని గత ఏడాది అదే గ్రామానికి చెందిన గోరంట్ల రాజేష్ అనే యువకుడు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. అయితే మిరప పంట సరైన దిగుబడులు రాక నష్టాలు వచ్చాయి. దీంతో రాజేష్ భూమి యజమాని పోతులూరయ్యకు సరిగా కౌలు చెల్లించలేదు. ఈ విషయమై ఇరువురి మధ్య తరచూ వివాదం జరుగుతోంది. అయితే ఈ ఏడాది కూడా పొలాన్ని తనకు కౌలుకు ఇవ్వాలని రాజేష్ అతనిని కోరడంతో ఆయన నిరాకరించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న రాజేష్ 15 రోజుల క్రితం పోతులూరయ్యపై గ్రామంలోని బస్టాండ్ సెంటరులో మరో వ్యక్తితో కలిసి దాడి చేసి కొట్టాడు. దీంతో కక్ష పెంచుకున్న ఆయన సోమవారం మద్యం సేవించి రాజేష్ ఇంటి వద్దకే వెళ్లి కత్తితో వీపుపై నరికాడు. అతను పెద్దగా కేకలు వేయడంతో ఇంటి పక్కనే ఉన్న కొందరు వచ్చి పోతులూరయ్యను అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను చికిత్స నిమిత్తం బంధువులు కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



దాడిలో రాజేష్ వీపుపై అయిన తీవ్ర రక్త గాయాలు

### యువకుడిపై దాడి.. కేసు నమోదు

లింగసముద్రం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపాలెంకు చెందిన బొమ్మల రాజేష్ అనే యువకుడిపై ఇటీవల గుర్తుతెలియని యువకులు దారికాచి దాడి చేసిన ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.నారాయణ తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన రాజేష్ కందుకూరు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ అక్కడి అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడి నుంచి వచ్చిన స్టేట్‌మెంటు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ప్రాణం తీసిన వేగం

● చెట్టును ఢీకొన్న కారు

● యజమాని మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు



చెట్టును ఢీకొన్న కారును పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకట్రావు

గుడ్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి) : అతి వేగం ఒకరి ప్రాణం తీసింది. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గుడ్లూరు-తెట్టు మార్గంలో పోట్లూరు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని దప్పళంపాడుకు చెందిన తూమాటి లక్ష్మయ్య(48) తన కారులో అదే గ్రామానికి చెందిన డ్రైవర్ చెరుకూరి మాధవతో కలసి ఆదివారం రాత్రి కావలికి బయలుదేరారు. మార్గమధ్యంలో పోట్లూరు వద్ద వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చుని ఉన్న కారు యజమాని లక్ష్మయ్యతోపాటు డ్రైవర్ మాధవకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున లక్ష్మయ్య మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. కాగా డ్రైవర్ మాధవను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదం సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకట్రావు సంఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. మృతుడు లక్ష్మ య్యా బంధువు తూమాటి మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాల కోసం ధర్నా

నెల్లూరు(హరనాథపురం), జూలై 14(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా పేదలకు రుణాలు ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ కార్పొరేషన్‌లు ప్రజలకు రుణాలు ఇవ్వకపోవటం తగదన్నారు. దీంతో వారు తండలకు, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుకు డబ్బులు తీసుకుని తీవ్రంగా నష్టపోతున్నారని, తిరిగి కట్టలేక పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో కే. శ్రీనివాసులు, బిల్ల మస్తానయ్య, జెడ్డా వాసు, రాజేశ్వరమ్మ, ఆర్. శ్రీనివాసులు, జే. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### 19న మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖలవారీగా సమీక్షించడంతో పాటు పారిశుధ్యం, సీజనల్ వ్యాధులు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

### బంగారం, వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ.9445 |
| వెండి కిలో ధర | రూ. 117400 |
| వెండి ఒక గ్రాము | రూ. 120.40 |

# శిథిలావస్థలో సదరన్ చానల్ వంతెన

- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు


శిథిలస్థితిలో ఉన్న సదరన్ కాలువపై ఉన్న వంతెన


కుంగిన సదరన్ కాలువ వంతెన రహదారి

సంగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం వద్ద ఉన్న సదరన్ చానల్ మీద ఉన్న మూడవ వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నారెడ్డిపాళెం గ్రామం సంగం మండల కేంద్రానికి తూర్పువైపు 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి కూతవేటు దూరంలో బుచ్చిరెడ్డిపాళెం ఉంది. దీంతో అన్నారెడ్డిపాళెం గ్రామస్థులు ఎక్కువగా దగ్గరలో ఉన్న బుచ్చిరెడ్డిపాళెం వైపు ప్రతి పనికి వెళతారు. సంగం మండల కేంద్రానికి రావాలన్నా బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లి అక్కడి నుంచి బస్సులో సంగం వస్తారు. అయితే అన్నారెడ్డిపాళెం బుచ్చిరెడ్డిపాళెంల మధ్య సదరన్ చానల్ ప్రవహిస్తుంది. ఈ కాలువను సుమారు 140 ఏళ్ల కిందట నిర్మించారు. ఈ కాలువ రిజర్వాయర్ నుంచి ప్రారంభమై సుమారు 9 కిలోమీటర్లు ప్రవహించి కోవూరు డ్రైన్‌లో కలుస్తుంది. సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసేందుకు దీన్ని నిర్మించారు. ఈకాలువ నిర్మాణ సమయంలో అన్నారెడ్డిపాళెం గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు ఏక వరుసలో వంతెన నిర్మించారు. అయితే ఈ వంతెన నిర్మించి శతాబ్దం పైబడడంతో శిథిలావస్థకు చేరింది. రహదారి మధ్యలో కాంక్రీట్ కుంగి దెబ్బతింది. దీనిపై కంకర వేసి గ్రావెల్‌తో పూడ్చి ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నారు.

#### పెరిగిన రాకపోకలు

అన్నారెడ్డిపాళెం గ్రామానికి ఏకైక రహదారిగా ఉన్న సదరన్ చానల్ వంతెన మీద రాకపోకలు పెరిగాయి. గ్రామంలో పండిన ధాన్యం ఈ రహదారి మీదుగానే లారీలు, ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించాలి. దీంతో వంతెనపై భారం పడుతోంది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శిథిలమైన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్


తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని గదులను క్షుణ్ణంగా పరిశీలించి చెత్తా చెదారం, దుమ్మూధూళీ, బూజు ఉండడాన్ని గమనించి అసహనం వ్యక్తం చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులను క్రమపద్ధతిలో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల నాయకులు, కార్యకర్తలు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులు గతంలో చేసిన తప్పిదాలను సరిచేయాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. ఇన్‌కం, క్యాస్ట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు త్వరితగతిన జారీచేయాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా 15రోజుల వ్యవధి లోపల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం కార్యాలయాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, సీడీపీఓ పద్మజాకుమారి, మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

#### అన్న క్యాంటీన్ నిర్మాణ పనుల పరిశీలన

మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. అలాగే అన్న క్యాంటీన్ పక్కన ప్రెస్‌క్లబ్ ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సీనియర్ నాయకులు చల్లా వెంకటేశ్వరు యాదవ్, పాములపాటి మాల్యాద్రి, పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్ ఏర్పాటు


స్టాల్ వద్ద కూరగాయలను కొనుగోలు చేస్తున్న సిబ్బంది

ఉదయగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల విద్యావనరుల కేంద్రం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూరగాయల స్టాల్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మెంటార్ సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా సాగుచేసిన కూరగాయల స్టాల్ ఏర్పాటుచేసి విక్రయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. అందులో భాగంగా ఈస్టాల్‌ను ఏర్పాటుచేశామన్నారు. వరికుంటపాడు మండలం నార్తకొండాయపాళెం, ఉదయగిరి మండలం గండిపాళెం, అప్పసముద్రం గ్రామాల్లో ఎలాంటి పురుగుమందులు వాడకుండా సాగుచేసిన గోంగూర, కాకర, మునక్కాయ, తోటకూర, కరివేపాకు, జామకాయలు, నిమ్మకాయలు, పసుపు తదితరాలు విక్రయించడం జరిగిందన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు అధికంగా కూరగాయలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు మహాలక్ష్మి, రామయ్య, అంకబాబు పాల్గొన్నారు.

## ఆత్మకూరు చెరువు మట్టి తరలింపుపై విచారణ చేపట్టాలి

- ఆర్డీవోకు రైతుసంఘం వినతి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

ఆత్మకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఆత్మకూరు చెరువు నుంచి సుమారు రూ. 4 కోట్ల విలువచేసే మట్టిని తరలించారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసు కోవాలని కోరుతూ రైతు సంఘం నాయకులు, పలువురు రైతులు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా భారీగా గుంతలు తీసి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, దీనివలన రైతులకు నష్టం జరుగుతోందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. దీంతో ఆర్డీవో బి పావని తహసీల్దారు పద్మజాకుమారి, ఇరిగేషన్ ఏఈ రవికుమార్‌తో చర్చించారు. వెంటనే పరిశీలించి తనకు పూర్తిస్థాయిలో నివేదికను అందజేయాలని కోరారు. నివేదిక వచ్చిన తరువాత పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె రైతు సంఘం నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు జి లక్ష్మీపతి, గంధం నాగరాజు, ఆర్ వెంకటేశ్వర్లు, పాపిశెట్టి కృష్ణమోహన్, పి హజరత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ షేక్ ఖాదర్‌వలి

ఏఎస్ పేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌వలి సూచించారు. సోమవారం ఆయన చిరమన పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, రక్తపరీక్షలు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డా. వినూత్న , వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల కోసం కాలనీవాసుల ఆందోళన


తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నబీసీ కాలనీ వాసులు

ఉదయగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి పంచాయతీ కుర్రపల్లి బీసీ కాలనీ వాసులు ఉపాధిహామీ పనులు కల్పించాలని సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో అన్ని గ్రామాలకు, కాలనీలకు ఉపాధి హామీ పనులు కల్పిస్తూ తమ కాలనీకి మాత్రం కల్పించడంలేదన్నారు. కాలనీ వాసులంతా కూలినాలి చేసుకుని జీవనం సాగించేవారన్నారు. మూడు నెలలుగా పనులు కల్పించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని, గతనెలలో అధికారులకు ఫిర్యాదు చేస్తే పని కల్పిస్తామని చెప్పి ఇంతవరకు పని కల్పించిన దాఖలాల్లేవన్నారు. అనంతరం ఎంపీడీవో అప్పాజీకి వినతిపత్రం అందజేశారు. దీంతో త్వరలో పనులు కల్పిస్తామని కాలనీ వాసులకు ఆయన హామీ ఇచ్చారు.

## అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ నరికివేతపై ఫిర్యాదు


తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఏఎస్ పేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూములలో ఉన్న చిల్ల, జామాయిల్ కర్ర నరికివేతపై అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం తహసీల్దారు అనిల్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. జమ్మవరం గ్రామంలో అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూములలో చిల్ల, జామాయిల్ సాగులో ఉన్నాయి. వాటిని మినగల్లు గ్రామానికి చెందిన రమణారెడ్డి కొన్నిరోజుల క్రితం నరికి తరలించి సొమ్ము చేసుకున్నారని, విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఎస్ఐ సైదులుకు ఫిర్యాదు చేశారు.

## నష్టపరిహారం కోసం రైతుల నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న రైతులు

సీతారామపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో నష్టపోయిన తమకు పరిహారం చెల్లించాలని కోరుతూ మారంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని మారంరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 153-7లో చప్పిడి వెంకటసుబ్బయ్య భూమిని ఆనుకొని ఉన్న ఉమ్మడి బావి 167బి హైవే రోడ్డు నిర్మాణంలో పూర్తిగా పోయిందని, నష్టపరిహారం గురించి హైవే వారిని అడగగా మండల రెవెన్యూ అధికారులు సర్వే చేసినప్పుడు బావిని చూపించలేదని, అందుకే నష్టపరిహారం పడ లేదని తెలిపారన్నారు. అనంతరం తమకు నష్ట పరిహారం మంజూరు చేయించాలని తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

## పొంచి ఉన్న ప్రమాదం

- పట్టించుకోని అధికారులు

సంగం మండలంలోని పడమటిపాళెం దళితవాడ వద్ద దువ్వూరు బ్రాంచి కాలువకు గట్లు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. కాలువ పక్కనే దళితవాడ గృహాలు ఉన్నాయి. కాలువ గట్లు కరిగిపోయి ఉండడంతో నీటి ప్రవాహం ఇళ్ల దగ్గరకు వస్తోంది. గతంలో కాలనీకి చెందిన ఓ బాలుడు ఆడుకుంటూ నీటిలోపడి మృతిచెందినా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి బ్రాంచి కాలువ నీరు పొర్లి కాలనీలోకి రాకుండా గట్లు పటిష్టంగా ఏర్పాటుచేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. - సంగం, (ఆంధ్రజ్యోతి)


పడమటిపాళెం దళితవాడ వద్ద పొంగి ప్రవహిస్తున్న దువ్వూరు కాలువ



## ‘ఉపాధి హామీ’ లక్ష్య సాధనకు కృషి

- జ్ఞానప్రకాష్, ఇన్‌చార్జ్ ఏపీవో

సంగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి కూలీలకు పనులకు కల్పించేందుకు చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్య సాధనకు కృషి చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏపీవో బి జ్ఞానప్రకాష్ తెలిపారు.

ఈ వారం ముఖాముఖి

**? ఎంతమందికి ఉపాధి హామీ పనులు కల్పిస్తారు. ప్రస్తుతం ఎంతమంది పనులకు వస్తున్నారు.**

! రోజుకు 2వేల మంది కూలీలకు పనులు కల్పించాలన్నదే లక్ష్యం. పంట కాలువల పూడికతీత పనులు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రస్తుతం రోజుకు 900 మంది పనులు చేస్తున్నారు.

**? లక్ష్య సాధనకు ఏమి చర్యలు చేపడుతున్నారు.**

! ప్రతి గ్రామంలో పనులు గుర్తించి మంజూరు ప్రతిపాదనలు పంపాం. పనులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 10 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. మిగిలిన పంచాయతీల్లో కూడా పనులు ప్రారంభించి కూలీల సంఖ్య రెండు వేలకు పెంచుతాం.

**? మండలానికి ఎన్ని గోకులాలు మంజూరయ్యాయి. ఇప్పటివరకు ఎన్ని పూర్తయ్యాయి.**

! మండలానికి 54 గోకులాలు మంజూరవగా, ఇప్పటికి 20 పూర్తయ్యాయి. 16 నిర్మాణంలో ఉన్నాయి. మిగిలినవి ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

**? మండలానికి ఎన్ని నీటి తొట్టెలు మంజూరయ్యాయి.**

! మూడు తొట్టెలు మంజూరవగా, తరుణవాయిలో ఒకటి నిర్మించారు. కొరిమెర్లలో నిర్మాణంలో ఉంది. పెరమనలో త్వరలో ప్రారంభిస్తాం. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.9 వేలు ఇస్తాం.

### న్యూస్ బాక్స్

## దోమల నివారణకు చర్యలు


ఆనకట్ట నీటిలో చేపపిల్లలను వదులుతున్న వైద్యాధికారిణి శివకల్పన

ఉదయగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు నీటివనరుల్లో గంబుషియా చేపపిల్లలను వదులుతున్నట్లు గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శివకల్పన పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆనకట్ట, కోనేరు నీటిలో గంబుషియా చేపపిల్లలను వదిలారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దోమలను నివారించడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు తదితర కీటక జనిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈకార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్ బాబు, హెచ్ఈ వెంకటేశ్వర్లు, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలి


పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక దళితవాడ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

# అదృశ్యమైన యువకుడి హత్య

- పెన్నాతీరంలో దారుణం
- స్నేహితులే హతమార్చినట్లు అనుమానాలు
- మిస్సింగ్ కేసును ఛేదించిన రూరల్ పోలీసులు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ డీఎస్పీ ఘట్టమనేని, సీఐ రామకృష్ణారెడ్డి


హత్యకు గురైన మోహన్‌చందు (ఫైల్)

నెల్లూరు రూరల్/పొదలకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు అదృశ్యమయ్యాడన్న ఫిర్యాదుతో మొదలైన రూరల్ పోలీసుల దర్యాప్తు హత్యాసంఘటనతో వెలుగులోకి వచ్చింది. రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు వివరాలు, నెల్లూరు రూరల్ మండల పరిధిలోని యలమవారిదిన్నెకి చెందిన కాయల మోహన్‌చందు (21) ఐదు రోజులుగా కనిపించడం లేదని, అతని అన్న డేనియల్‌రాజు ఆదివారం ఫిర్యాదుచేశారు. దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు అతడితో వివాదాలున్న పొదలకూరు మండలం విరువూరుకి చెందిన తరుణ్‌కుమార్‌రెడ్డిపై అనుమానం కలిగింది. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో వివాదాలు ఉండటం, తరుణ్ భార్య అతడితో విడిపోయి ఉండటంతో ఆమెతో మోహన్ మాట్లాడుతున్నాడేమోనన్న అనుమానం తదితర విషయాలపై ఇరువురి మధ్య వివాదాలు జరుగుతుండేవి. ఈ క్రమంలో చర్చల కోసం మోహన్‌చందును తన ఊరికి పిలిపించుకున్న తరుణ్ ఈ నెల 9న అర్ధరాత్రి ఊరిపక్కనున్న పెన్నా పొర్లుకట్ట ప్రాంతమైన ప్రగతినగర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ తరుణ్ స్నేహితులైన సోమశేఖర్, సురేష్, శ్రీధర్‌ల సాయంతో కత్తితో పొడిచి, గడ్డపారతో కొట్టి హతమార్చాడు. ఈనేపథ్యంలో తరుణ్‌ను సోమవారం అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయని సీఐ తెలిపారు. మోహన్‌చందును హతమార్చిన అనంతరం అక్కడే గొయ్యితీసి పూడ్చినట్లు నిందితుడు తెలిపారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కాగా, ఈ కేసు విషయమై నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో మోహన్‌చందుకు తరుణ్‌కి మధ్య ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షలు ఉన్నాయని తెలిపారు. రెండు రోజుల క్రితం కార్ల కొనుగోలు విషయమై కూడా విభేదాలు తలెత్తినట్లు ఆయన వివరించారు. ఈనేపథ్యంలో ఈ హత్య జరిగిందన్నారు. పొదలకూరు తహసీల్దారు శివబాలకృష్ణయ్య, రూరల్, పొదలకూరు సీఐలు, ఎస్ఐలు, వైద్యుల ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సంగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లు గ్రామంలో పి శ్రీనివాసులు (50) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులిద్దరికీ వివాహాలయ్యాయి. ప్రస్తుతం భార్యాభర్తలు మాత్రమే ఉంటున్నారు. ఈక్రమంలో శ్రీనివాసులు ఆదివారం రాత్రి సమీపంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. అయితే ఎంతసేటికీ రాకపోవడంతో చుట్టుపక్కల వారికి భార్య తెలిపింది. దీంతో వారు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఎక్కడికైనా వెళ్లాడనుకున్నారు. కానీ సోమవారం రాత్రి 7గంటల సమయంలో చెరువు వద్దకు వెళ్లిన వారికి ఒడ్డున శవం తేలాడుతుండడంతో అనుమానం వచ్చి పరిశీలించగా శ్రీనివాసులుదిగా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీసి పోసుమార్టంకు తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

### ● కలిగిరిలో యువకుడు..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

కలిగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరనకొల్లు గ్రామ పొలాల్లో నూతన పెట్రోల్‌బంకు సమీపంలో సోమవారం గుర్తుతెలియని యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్ఐ ఉమాశంకర్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రైతులు పొలాల్లో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. మృతుని కుడిచేతికి ఓపక్క తెలుగులో సత్యవతి అని, మరో పక్క వంశీ-కల్యాణి అని ఇంగ్లీషు అక్షరాలు, మధ్యలో సింహం బొమ్మ ఉన్నాయని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ● చికిత్స పొందుతూ యువకుడు..

నెల్లూరు(క్రైం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని కోటమిట్టకు చెందిన జలీల్(32), రేష్మ దంపతులు. వారికి ముగ్గురు సంతానం. కొద్ది రోజులుగా వారి మధ్య విభేదాలు నడుస్తున్నాయి. ఈ నెల 9న రాత్రి రేష్మ పిల్లలను తీసుకుని ఖుద్దూస్‌నగర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలోనే జలీల్ తనకు చనిపోవాలని ఉందంటూ భార్యకు ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో రేష్మ అన్నదమ్ములతో కలిసి హుటాహుటిన భర్త ఇంటికి వెళ్లింది. ఇంటి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా, రాకపోవడంతో పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. జలీల్ ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో జలీల్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు ఈ నెల 11న చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు.ఈ మేరకు మృతుడి బావమరిది షేక్ సికిందర్ సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కర్నాటక బ్యాంకులో అగ్నిప్రమాదం


బ్యాంకులో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నెల్లూరు(క్రైం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బృందావనంలో ఉన్న కర్నాటక బ్యాంక్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారుల సమాచారం మేరకు, బృందావనంలో ఉన్న కర్నాటక బ్యాంకు ఇన్వర్టర్, బ్యాటరీ రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బ్యాంకులో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, బ్యాంకు అధికారులకు సమాచారం అందించారు. లీడింగ్ ఫైర్‌మన్ బాలాజీగురుప్రసాద్ నేతృత్వంలో కే. చంద్రశేఖర్, మల్లికార్జున, మధు ఫైరింజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. లేకుంటే భారీగా నష్టం వాటిల్లేది. బ్యాంకు జీఎం సీహెచ్ సతీష్ నుంచి అగ్నిమాపక సిబ్బంది ప్రమాద వివరాలు సేకరించారు.ఈ ప్రమాదంలో రూ.3.5 లక్షల మేర అస్తినష్టం వాటిల్లినట్లు ఫైర్‌సిబ్బంది పేర్కొన్నారు.

**చికెన్ ధరలు**
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 116 |
| స్కిన్ చికెన్ | 210 |
| స్కిన్‌లెస్ | 234 |

కోడిగుడ్ల ధర (100): 515

## 25న సీపీఐ కావలి నియోజకవర్గ స్థాయి మహాసభ

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నియోజకవర్గ మహాసభ ఈనెల 25న స్థానిక పామూరు బస్టాండ్‌లోని లక్ష్మీశ్రీనివాస కళ్యాణ మండపంలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి.మాలకొండయ్య తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సమయంలో జరుగుతున్న ఈ మహాసభలకు ప్రాధాన్యత ఉందని కార్యకర్తలు, నాయకులే గాక సానుభూతిపరులు, యువత అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేసేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు నత్తా రామారావు, బి.సురేష్‌బాబు, వై.ఆనంద్‌మోహన్, ఎస్కే హుస్సేన్, మురళి, ద్రోణాదుల ఆదినారాయణ, ఎం.లక్ష్మీనారాయణ, బాలబ్రహ్మాచారి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

# దర్జాగా కలుజు కాలువ కబ్జా

● చెరువు ఆక్రమణలు పట్టని సాగునీటి సంఘం సభ్యులు, అధికారులు



కలుజు కాలువ మట్టితో పూడ్చిన చోట తోలిన వ్యర్థాలు

కావలి రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలంచర్ల గ్రామ చెరువు కలుజు కాలువ దర్జాగా కబ్జా చేస్తున్నా.... గ్రామంలోనే ఉన్న ఇటు సాగునీటి సంఘం అధ్యక్షుడికి కానీ, సభ్యులకుకానీ, అటు ఇరిగేషన్ అధికారులకు కానీ పట్టడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. చెరువు విస్తీర్ణం సుమారు 350 ఎకరాలు కాగా, అందులో 50 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందన్నారు. చెరువు పారుదలతో అధికారికంగా సుమారు 350 ఎకరాలు, అనధికారికంగా 600 ఎకరాలు సాగవుతుంది. ఇక చెరువు నిండినప్పుడు కలుజు నీళ్లు పారే కాలువ మొత్తం అధికారపార్టీ నేతల సహకారంతోనే కబ్జాకు గురైంది. కబ్జాదారులు ముందుగా కాలువలో మట్టి తోలించి కాలువ స్థలం ఆక్రమించారు. అదే స్థలంలో ఇటీవల గ్రామంలో పైప్‌లైన్ల నిర్మాణం కోసం పగలగొట్టిన రోడ్డు కంకర వ్యర్థాలు కూడా అక్కడే తోలారని రైతులు విమర్శిస్తున్నారు. కాలువ ఆక్రమణతో చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, వారు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

# వలేటివారిపాలెంలో అంధకారం!

● ఐదారు నెలలుగా వెలగని వీధిలైట్లు ● పట్టించుకోని పంచాయతీ పాలకులు, అధికారులు



మరమ్మతులకు గురైన వీధిలైటు

వలేటివారిపాలెం, జూలై 14(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో రాత్రుళ్లు అంధకారం నెలకొంటోంది. స్థానిక బీసీ కాలనీ, పెద్దబజార్, చిన్నపాలెం, మెయిన్‌బజార్, మంగళపాలెం, గాంధీనగర్, బ్యాంక్ బజార్‌లలో సుమారు ఐదారు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ఆయా కాలనీల్లోని ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా మరికొన్ని చోట్ల కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. రాత్రి వేళ్లలో బయటకు వెళ్లాలంటే పాములు, తేళ్లు ఎక్కడ కాటు వేస్తాయోనని ప్రజలు బయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం డపాదడపా కురుస్తున్న వర్షాల వలన విష పురుగులు రాత్రి వేళ్లలో వీధుల్లోనే తిరుగుతున్నాయి. చీకటి పడితే వాటి నుంచి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. దీనికి తోడు చినుకు పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

### ఏడాది నుంచి వెలగడం లేదు



మా వీధిలో ఏడాది నుంచి వీధిలైటు వెలగడం లేదు. రాత్రి సమయంలో వీధిలోకి రావాలంటేన భయమేస్తోంది. విష పురుగులు వీధుల్లోనే తిరుగుతున్నాయి. దీనికి తోడు ఆకతాయిలు ఆగడాలు పెచ్చరిల్లిపోతున్నాయి. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- కొంకా కృష్ణయ్య, బ్యాంక్‌బజారు, వలేటివారిపాలెం

## స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ధర్నా




విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

కావలి(టౌన్), జూలై 14(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఈఈకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ పెంచిన కరెంటు చార్జీలు తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రూ.16 వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపిందని ఆరోపించారు. పెంచిన కరెంటు చార్జీలు కట్టలేక బాధపడుతున్న ప్రజలకు స్మార్ట్ మీటర్ల బిగింపు మరింత ఆందోళనకు గురిచేస్తుందన్నారు. అదానీకి దోచిపెట్టేందుకే స్మార్ట్ మీటర్ల బిగింపు అని గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని చెప్పిన తెలుగుదేశం నేతలు ఇప్పుడేం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలని, లేనిపక్షంలలో ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడకు వెళ్లి కానిస్టేబుల్ రక్తదానం

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుర్రంవారిపాలెంకు చెందిన ఓ వ్యక్తికి విజయవాడలోని రమేష్ ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్స కోసం అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకుని డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దాసరి వినోద్‌కుమార్, అతని మిత్రుడైన ఉప్పుచెరువు కాలనీకి చెందిన వెలిచర్ల నరసింహారావులు విజయవాడకు వెళ్లి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. బ్లడ్ డోనార్స్ వాట్సాప్ గ్రూపు సభ్యులుగా వీరు చూపించిన స్ఫూర్తిని పలువురు అభినందించారు. కానిస్టేబుల్ వినోద్‌కుమార్ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూ ప్రాణదాతగా నిలుస్తున్నారని ప్రశంసించారు.

## ఎట్టకేలకు కాలువలో పూడికతీత



ప్రధాన కాలువలో పూడికతీస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31, 38వ వార్డులకు సంబంధించిన ప్రధాన డ్రైనేజీ పూడిపోయి మురుగు నీటితో పాటు వర్షపునీరు పారుదలకు ఆటంకం కలుగుతోంది. కాలువ పక్కన ముస్లిం శ్మశానవాటిక కూడా ఉండటంతో వర్షాకాలం నీరు ఆ ప్రాంతంలో రోడ్డు ఎక్కి పారుతూ ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వెంటనే పూడికతీయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు సోమవారం గ్యాంగ్ వర్క్ పెట్టి కాలువలో ఎప్పటి నుంచో పేరుకుపోయి ఉన్న చెత్తాచెదారాన్ని పూడిక మట్టిని తొలగించి నీటి పారుదలకు ఉన్న ఆటంకం తొలగింపచేశారు. ఈ పనులను ఆయా వార్డుల టీడీపీ నాయకులు మంచాల ప్రసాద్, తలపనేని ప్రభాకర్, దశరథరామయ్య, బెజవాడ రవీంద్ర, భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు.

## మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ





అవగాహన ర్యాలీలో న్యాయాధికారులు, న్యాయవాదులు

కావలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ మండల న్యాయసేవాధికారసంస్థ, కావలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో న్యాయాధికారులు, న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర లీగల్‌సెల్ అథారిటీ ఆదేశాల మేరకు ప్లకార్డులు, బ్యానర్లతో కోర్టు ప్రాంగణం నుంచి స్థానిక ఉదయగిరి బ్రిడ్జి కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. కోర్టులో పేరుకు పోతున్న కేసులను మధ్యవర్తుల ద్వారా రెండు పార్టీలు ఒక నిర్ణయానికి వచ్చి సత్వరపరిష్కారం చేసుకునే విధంగా అవగాహన కల్పించటమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. ఈ అవగాహన ర్యాలీలో సబ్ న్యాయాధికారి గీతావాణి, జూనియర్ సివిల్ న్యాయాధికారి సుధాకర్, జ్యుడిషయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విక్రమసింహ, స్పెషల్ న్యాయాధికారి పరుశురాం, కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై బారికేడ్ల ఏర్పాటు

జలదంకి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు జలదంకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్ 167బిజి రహదారిపై 9వ మైలు వద్ద సోమవారం ఎస్ఐ లతీఫున్నీసా బారికేడ్లు ఏర్పాటు చేయించారు. కావలి నుంచి ఉదయగిరికి రాకపోకలు సాగించే వాహనాలు ఈ కూడలి ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. వేగంగా వచ్చే వాహనాలతో తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రమాద నివారణ చర్యలు చేపట్టామన్నారు. వాహనచోదకులు ముఖ్యమైన కూడలి ప్రాంతాల్లో వేగం తగ్గించి వాహనాలను నడపాలని కోరారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కరపత్రం అందజేసి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలని, అవి సక్రమంగా అందుతున్నాయా లేదా అని అధికారులతోపాటు నాయకులు పర్యవేక్షించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. పట్టణంలోని పాతూరు ప్రాంతంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. పక్కా గృహాలు కావాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా వారి వివరాలు నమోదు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, కార్యదర్శి కాకు మహేష్, చీమల తాతయ్య, నిశ్శంకర సురేష్, ఊసా మాల్యాద్రి, కొప్పోలు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు లేని ఓటర్ల బాబితా బీఎల్‌వోల బాధ్యత

● కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ



బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ

కందుకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): తప్పులు తడకలు లేని ఓటర్ల జాబితా రూపొందించటంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆ జాబితాలో స్థానం దక్కేలా కృషి చేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓల దేనని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ పేర్కొన్నారు. కందుకూరు రూరల్ మండల పరిధిలోని 37మంది బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ)లకు సోమవారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాల రూపకల్పనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్‌గా బి.కృష్ణవేణి వ్యవహరించగా తహసీల్దారు వి. లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లదొన చెరువుకు సోమశిల జలాలు సరఫరా చేయాలి



నెల్లూరులో సోమశిల ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న గుడ్లదొన రైతులు, ప్రాజెక్టు వైస్‌చైర్మన్ మధుమోహన్‌రెడ్డి

కలిగిరి, జూలై 14( ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్లదొన చెరువుకి కావలి కాలువ నుంచి సోమశిల జలాలు సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సోమశిల ఎస్ఈ రమణారెడ్డికి సోమవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో సోమశిల ప్రాజెక్టు వైస్‌చైర్మన్ పులుగుంట మధుమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడ్లదొన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గతంలో ఎత్తిపోతల పథకం ద్వారా నీరు చెరువుకి అందేదని, ప్రస్తుతం ఆ పథకం కింద ఏర్పాటు చేసిన సామగ్రి పనికిరాకుండా శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ విషయమై నిధులు మంజూరు చేసి ఎత్తిపోతల పథకాన్ని వాడుకలోకి తీసుకువచ్చి చెరువుకు నీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాలపనేని వెంకటరమణయ్య, పట్నం వెంకటేశ్వర్లు, బొట్లా రాధాకృష్ణయ్య, దేవరపల్లి దశరథరామిరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



గణేష్ నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి, తదితరులు

కావలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): కలుగోళ్లశాంభవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న 9వ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆగస్టు 27వ తేదీ నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వహకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

● పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పట్టణంలోని పలువురి ఉత్తర క్రియల్లో పాల్గొని ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోఆపరేటివ్ కాలనీలోని గోనుగుంట రఘు తల్లి భారతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బృందవనం హౌసింగ్ కాలనీలో వేమూరి పెద్దిశెట్టి సతీమణి ప్రమీల చిత్రపటం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేత గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, నాయకులు తిరువీధి ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా 'పీజీఆర్‌ఎస్'




కొండాపురం : అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు కోటేశ్వరరావు

కొండాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) మొక్కుబడిగా జరిగింది. కేవలం రెండు వినతులు వచ్చాయి. అందులో మండలంలోని గొట్టిగుండాలలో పొలాలకు వెళ్లే రోడ్డును సర్వే చేయాలని, భీమవరప్పాడులో సర్వే నెంబరు 151లో ఎద్దుల బీడు హద్దులు తేల్చాలని కోరుతూ వినతులు అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

### బోగోలులో ఐదు అర్జీలు

బిట్రగుంట : బోగోలు మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు సానా శ్రీనివా సరెడ్డి తెలిపారు. బోగోలులో ఇంటి స్థలం హద్దులు చూపించాలని ఒకటి, కోర్టు పరిధిలో ఉండే పొలం వివాదాలకు సంబంధించిన రెండు అర్జీలు, స్థలం ఆక్రమించుకున్నారని, పొలానికి సంబంధించి ఆధార్ లింకు చేయాలని కోరుతు వినతులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయమ్మ, ఎంఏవో శైలజ, హౌసింగ్ ఏఈ, అంగన్వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

### గ్రీవెన్స్‌కు నలుగురు అధికారుల హాజరు

ఉలవపాడు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మండలంలోని నలుగురు అధికారులు హాజరయ్యారు. తహసీల్దారు శ్రీనవాసులు సెలవులో ఉండగా, డీటీ హనుమమ్మ ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సులో పాల్గొన్నారు. దీంతో ఐసీడీఎస్‌కు చెందిన ఇద్దరు అధికారులు, వెలుగు, వ్యవసాయ శాఖకు చెందిన ఇద్దరు అధికారులు హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. అధికారులు ఎవరు లేకపోవడంతో రెండు ఫిర్యాదులు మాత్రమే అందాయి.

### దిష్టిబొమ్మల్లా చెత్తతో సంపద

# తయారీ కేంద్రాలు!

● ప్రారంభానికి నోచుకోకనే శిథిలావస్థకు ● పలు పంచాయతీల్లో కప్పులేని పిల్లర్లు
● తుప్పు పడుతున్న రిక్షాలు ● నిరుపయోగంగా వర్మీకంపోస్టు పిట్లు



వీఆర్ కోటలో పైకప్పు లేచిపోయి దర్శనమిస్తున్న పిల్లర్లు

లింగసముద్రం, జూలై 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రత, సంపద సృష్టిని దృష్టిలో పెట్టుకుని 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో వీటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గ్రామాల్లోని తడి, పొడి చెత్తను చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు తరలించి, అక్కడ వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. అంతేకాకుండా గ్రామాల్లోని చెత్తను తరలించి గ్రామాలను చెత్త రహితంగా, పరిశుభ్రంగా మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ మండలంలోని 16 గ్రామ పంచాయతీలకుగాను వీఆర్ కోట, విశ్వనాథపురం, అన్నెబోయినపల్లి, లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల్లో 2014-19లో పిల్లర్లు ఏర్పాటు చేసి తాటాకులతో చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. మొగిలిచెర్ల గ్రామంలో ఈ కేంద్రాన్ని అసలు నిర్మించలేదు. మిగిలిన 10 గ్రామ పంచాయతీలలో రేకులతో కేంద్రాలను నిర్మించారు. ఈ 10 పంచాయతీలలో తడి పొడి చెత్తను రిక్షాల ద్వారా తరలించి, వర్మీకంపోస్టు ఎరువు తయారీ ప్రక్రియ జరుగుతోంది. అయితే తాటాకులతో నిర్మించిన 5 కేంద్రాల పైకప్పులు గాలులకు లేచిపోయి, పిల్లరు మాత్రమే నిలిచి ఉన్నాయి. దీంతో మండలంలోని 6 కేంద్రాలలో చెత్త తరలింపు రిక్షాలు, వర్మీకంపోస్టు పిట్లు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభం కాకనే శిథిలావస్థకు చేరుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో చెత్త నిల్వలు ఉండడంతో ఇవి దోమలకు ఆవాసాలుగా మారాయి. అంతేగాకుండా ఆయా గ్రామాలలో నియమించిన క్లాప్‌మిత్రలకు పెద్దగా పని ఉండడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ఈ చెత్త తరలింపుకు పంపిణీ చేసిన రిక్షాలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, గ్రామాలలో తుప్పుపట్టి పోతున్నాయి. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే ఐదారు నెలల క్రితం ఈ కేంద్రాలను పరిశీలించిన అధికారులు, వాటి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్టు తెలిసింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



లింగసముద్రంలో నిరుపయోగంగా ఉన్న వర్మీకంపోస్టు పిట్లు



జిలపాలవారిపాలెంలో చెత్తకుప్పల్లో తుప్పుపడుతున్న రిక్షా

# వంద కోట్ల అభివృద్ధి

వెంకటగిరి ఎమ్మెల్యే

కురుగొండ్ల రామకృష్ణ



## 1 ఏడాదిలో ఏం చేశారు?

కష్టపడే నాయకుడిగా ఆయనకు పేరు. నిరంతరం జనంలోనే ఉంటారు. చదివింది అయిదో తరగతే అయినా అన్ని అంశాలపై లోతైన అవగాహన గల చురుకైనవాడు. యుక్తవయసులో చెన్నై వెళ్ళి వ్యాపారంలోకి దిగి ఆర్థికంగా వృద్ధిలోకి వచ్చారు. వెంకటగిరి శాసనసభ్యుడిగా మూడోసారి గెలిచిన కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి నియోజకవర్గం కోసం ఏం చేస్తున్నారు? తొలి ఏడాది ఏం చేశారు? మలి ఏడాది లక్ష్యాలుగా ఏమి పెట్టుకున్నారు? వెంకటగిరి ప్రోగ్రెస్ రిపోర్ట్...

- 6వ పేజీలో

# వేలి ముద్ర వేయాల్సిందే



- అన్ని లాడ్జీలు, హోం స్టేలు, హోటళ్లలో త్వరలో పరికరాల ఏర్పాటు
- గదులు పొందే నేరస్థుల గుర్తింపుకోసం పోలీసుల వినూత్న విధానం

ఎక్కడో హత్యలు చేస్తారు. ఎక్కడో నేరాలకు పాల్పడతారు. తిరుపతిలో ఆశ్రయం పొందుతారు. ఇలా ఎక్కడపడితే అక్కడ నేరస్థులు తప్పుడు వివరాలిచ్చి దర్జాగా తలదాచుకునే పరిస్థితి లేకుండా పోలీసులు వినూత్న విధానాన్ని తీసుకొస్తున్నారు. లాడ్జీల్లో వేలి ముద్ర వేస్తేనే గదులిచ్చేలా చర్యలు చేపడుతున్నారు.

తిరుపతి(నేరవిభాగం), జూలై 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో దేశ విదేశాల నుంచి శ్రీవారి దర్శనం కోసం రోజూ వేలాది మంది వస్తుంటారు. అదే సమయంలో కొన్ని అసాంఘిక శక్తులూ వచ్చి తలదాచుకుంటున్నాయి. ఇప్పటి వరకు ఆధార్, చిరునామా తీసుకుని బయటి వారికి గదులు ఇస్తున్నారు. దీనివల్ల కొన్ని ఫలితాలున్నా.. పలు హోటళ్లు, లాడ్జీలు, హోంస్టేలలో తూతూమంత్రంగా అమలు చేస్తున్నారు. దీంతో ఎస్పీ హర్షవర్ధనరాజు జిల్లాలోని అన్ని వసతి సముదాయాల్లో ఆన్‌లైన్ విధానం అమలుకు చర్యలు తీసుకున్నారు. అన్ని హోటళ్లు, లాడ్జీలు, హోంస్టేల కాంటాక్టు నెంబర్లు తీసుకుని వాటిని పోలీసు యాప్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికి 261 హోంస్టేలు, 304 లాడ్జీలను ఆన్‌లైన్ చేశారు. మిగిలిన వాటినీ త్వరలో ఆన్‌లైన్ చేయనున్నారు. ఇక, గదులు దిగే వారి అడ్రస్‌లు, కాంట్రాక్టు నెంబర్లు కూడా పోలీసు యాప్‌తో అనుసంధానమయ్యేలా చూస్తున్నారు. అన్ని హోటళ్లు, లాడ్జీలు, హోం స్టేలలో వేలిముద్రల డివైజర్లను నాలుగు నెలల వ్యవధిలో అందుబాటులో ఉంచనున్నారు. ఆ తర్వాత నుంచి వేలిముద్ర వేస్తేనే గదులు ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియను పోలీసు కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేస్తారు. దీంతో గదుల కోసం వేలి ముద్ర వేసిన వారిలో నేరస్థులుంటే.. వారి నేర చరిత్ర తెలుసుకోవడానికి వీలవుతుంది. ఏ గదిలో ఎవరు.. ఎంతమంది.. ఏప్రాంతానికి చెందిన ఉంటున్నారనే వివరాలూ తెలుసుకోవచ్చు. ఇది అమలైతే నేరాలు, అసాంఘిక కార్యక్రమాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయని ఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు.



కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

# చేనేత-హస్తకళల్లో జిల్లాకు మొదటి బహుమతి

- కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్
- వెంకటగిరి పట్టుచీరకు జాతీయ గుర్తింపు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో చేనేత, హస్తకళల విభాగంలో (వెంకటగిరి పట్టుచీరలకు) జిల్లాకు ప్రథమ బహుమతి లభించింది. కేంద్రప్రభుత్వం నిర్వహించిన ఓడీఓపీ (వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడెక్ట్) జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ఢిల్లీలోని భారత మండపం(ప్రగతిభవన్)లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్, సీఎం రేఖ గుప్తా చేతుల మీదుగా మొదటి బహుమతి (బంగారు కేటగిరి)ని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం అందుకున్నారు. 'జిల్లాలో ఓడీఓపీ కింద ప్రోత్సహిస్తున్న వెంకటగిరి పట్టుచీరలు, స్థానికంగా చేనేత ఉత్పత్తుల వైశిష్ట్యం, నాణ్యత, గౌరవానికి జిల్లాకు మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది. ఇలాంటి పురస్కారాలు కళాకారులను ప్రోత్సహించేలా ఉంటుంది. వారి జీవనోపాధికి భరోసా కల్పిస్తుంది. వెంకటగిరి చీరలకు జాతీయస్థాయి గుర్తింపు రావడం, ప్రాంతీయ కళాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చే అవకాశాన్ని కలిగించింది' అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్, రాష్ట్ర మంత్రి సవిత, జిల్లా చేనేత అధికారి రాచపూడి రమేష్ పాల్గొన్నారు.

# నేటి నుంచి లెక్చరర్ పోస్టులకు పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో వివిధ లెక్చరర్ పోస్టులకు మంగళవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ నెల 23వ తేది వరకు ఆరు కేంద్రాల్లో.. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. 6,412మంది హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

# వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికకు 16మంది బాలబాలికలు హాజరు




బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి(క్రీడలు), జూలై 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలకు ఈనెల 11, 14 తేదీల్లో తిరుపతి అర్బన్, రూరల్, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, తడ నుంచి 16 మంది హాజరయ్యారు. వీరిలో ఐదుగురు బాలికలు, 11 మంది బాలురు ఉన్నారు. తిరుపతిలోని ఎస్వీయూ మైదానంలో డీఎస్‌డీవో శశిధర్ ఆధ్వర్యంలో డీఎస్ఏ కోచ్‌లచే వీరికి ఆరు ఈవెంట్లలో బ్యాటరీటెస్టులు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. ఈ నివేదికను వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ యాజమాన్యానికి పంపారు. అక్కడ నివేదికను పరిశీలించి డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో 4, 5వ తరగతుల ప్రవేశానికి అర్హుల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు.

# అరక్కోణం ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్టు

తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా దందా సాగిస్తున్న తమిళనాడు రాష్ట్రం అరక్కోణం ప్రాంతానికి చెందిన స్మగ్లర్‌పై కలెక్టర్ వెంకటేశ్వర్ పీడీ యాక్టు కింద కేసు నమోదుకు ఆదేశించారు. అరక్కోణం పట్టణం పిళ్ళారి కోవిల్ వీధికి చెందిన బాబు నాయుడు కుమారుడు అజిత్ నాయుడు (29) అరక్కోణం తాలూకా పరిధిలోని కిజవనం పంచాయతీ బోడినాయుడు కండ్రిగలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా జిల్లా పరిధిలో ఎర్రచందనం వృక్షాల నరికివేత, అక్రమ రవాణా వ్యవహారాల్లో పాల్గొంటున్నాడు. గతేడాది నుంచీ ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో ఇతడిపై ఐదు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం కడప సెంట్రల్ జైలులో రిమాండులో వున్నాడు. ఇతడి నేర చరిత్ర, వాటి తీవ్రతలను దృష్టిలో వుంచుకుని కలెక్టర్ వెంకటేశ్వర్ గత నెల 11వ తేదీన పీడీ యాక్టు ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 27న వీడియో కాన్ఫరెన్సు ద్వారా అడ్వైజరీ బోర్డు ఈ కేసును సమీక్షించి సానుకూల నివేదిక ఇవ్వడంతో ప్రభుత్వం కలెక్టర్ నిర్ణయాన్ని ఆమోదించింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# శ్రీనివాసులు హత్యకు కారణాలేమిటి?

ఆరా తీస్తున్న చెన్నై పోలీసులు ● దర్యాప్తులో సహకరించేందుకు చెన్నైకి రేణిగుంట సీఐ



శ్రీనివాసులు మృతదేహం

తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచలనం సృష్టించిన శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌ఛార్జి వినుత మాజీ పీఏ శ్రీనివాసులు హత్యకు కారణాలేమిటన్నది అంతుబట్టడం లేదు. పాతికేళ్ల యువకుడిని పలుమార్లు చిత్రహింసలకు గురి చేశారని, దెబ్బలకు తట్టుకోలేకే అతడు చనిపోయాడని చెన్నై పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. హత్యకు గురైంది కూటమి ప్రభుత్వంలోని అధికార పార్టీకి చెందిన మహిళా నేత డ్రైవరు, వ్యక్తిగత సహాయకుడూ కావడంతో ఇది సంచలనంగా మారింది. అన్ని రాజకీయ పార్టీల వర్గాలతో పాటు సామాన్య జనం కూడా హత్య వెనుక వాస్తవాలు తెలుసుకోవాలని ఆసక్తితో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది చెన్నై పోలీసులు కావడంతో హత్యపై సస్పెన్స్ కొనసాగుతోంది

## నిందితుల కస్టడీకి పిటిషన్

శ్రీకాళహస్తి మండలం బొక్కిసపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు మృతదేహం చెన్నైలో లభించడంతో అక్కడి సెవెన్ వెల్స్ ప్రాంత పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ప్రాథమిక దర్యాప్తులో శ్రీనివాసులు మృతికి శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి వినుత, ఆమె భర్త చంద్రబాబు, వారి ముగ్గురు అనుచరులు కారకులని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని చెన్నైకి తరలించి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు పంపించారు. అరెస్టుకు, రిమాండుకు పంపడానికి నడుమ పెద్దగా వ్యవధి లభించకపోవడంతో వారు నిందితులను లోతుగా విచారించలేదని తెలిసింది. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. ఇపుడు నిందితులను కస్టడీకి తీసుకుని విచారిస్తే హత్యకు దారి తీసిన కారణాలేమిటన్నది తెలుస్తాయని చెన్నై పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా వారు అక్కడి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ లోపు చెన్నై పోలీసు కమిషనరేట్ నుంచీ వచ్చిన అభ్యర్థనతో కేసు దర్యాప్తులో సహకరించేందుకు రేణిగుంట సీఐని చెన్నై వెళ్లాల్సిందిగా జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. దీంతో రేణిగుంట, శ్రీకాళహస్తి ప్రాంతాలకు సంబంధించిన సమాచారం ఇవ్వడంతో పాటు కేసు దర్యాప్తులో చెన్నై పోలీసులకు సహకరించడానికి రేణిగుంట సీఐ హుటాహుటిన చెన్నై బయల్దేరి వెళ్ళారు.

## హత్యకు ఇవేనా.. కారణాలు?

చెన్నై పోలీసులు నిందితులను ప్రాథమికంగా విచారించిన సందర్భంలో రెండు కారణాలు హత్యకు దారి తీసివుండవచ్చని భావించినట్టు తెలిసింది. వీటిలో ఒకటి వివాహేతర సంబంధం కాగా మరోటి వ్యక్తిగత సమాచారం ఇతరులకు చేరవేయడం అని చెన్నై పోలీసులు భావిస్తున్నారు. శ్రీనివాసులు తొలుత వినుతకు కారు డ్రైవరుగా నియమితులయ్యారని, తర్వాత క్రమంగా వ్యక్తిగత సహాయకుడిగా కూడా మారాడని తెలిసింది. ఆ కుటుంబానికి బాగా సన్నిహితంగా మారాడు. శ్రీకాళహస్తి, చెన్నై తదితర ప్రాంతాల్లో కొనసాగించిన వ్యక్తిగత వ్యవహారాలు, సెటిల్‌మెంట్లు వంటి వివరాలు శ్రీనివాసులు వద్ద వున్నట్టు చెన్నై పోలీసులు భావిస్తున్నారు. వాటిని చూపి బ్లాక్‌మెయిల్ చేయడం, వినుత ప్రత్యర్థులకు వాటిని అందించడం వంటివేవో జరిగాయని అనుమానిస్తున్నారు. వినుత దంపతులు శ్రీనివాసులును పీఏగా తొలగిస్తున్నట్టు విడుదల చేసిన ప్రకటనలో కూడా 'అతడు తమ ప్రాణ, గౌరవాలకు భంగం కలిగించాడు' అని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. ఈ దిశగానే విచారిస్తున్నారు.

## దూకుడు రాజకీయాలతో ఒంటరైన వినుత

కాగా, రాజకీయంగా బలం లేకపోయినా వినుత వర్గం దూకుడుగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష నేతలతో పాటు కూటమి పార్టీల నేతలతో కూడా వ్యక్తిగత వైరాన్ని కొనితెచ్చుకున్నట్టు నియోజకవర్గంలో ప్రచారమవుతోంది. చివరికి సొంత పార్టీలో కూడా అందరూ దూరమయ్యారని, ఇరుగుపొరుగు నియోజకవర్గాల నేతలు, జిల్లా నేతలతోనూ సత్సంబంధాలు లేవని జనసేన వర్గాలే చెబుతున్నాయి. ఒకరకంగా నియోజకవర్గంలోనూ, జిల్లాలోనూ రాజకీయంగా వినుత ఒంటరిగా మారినట్టయిందని సమాచారం. ఆ క్రమంలో వినుత పీఏగా ఉండిన శ్రీనివాసులు ఇతర పార్టీలకు చెందిన ఒకరిద్దరు నేతలకు టచ్‌లోకి వెళ్లారని, వినుత వర్గానికి చెందిన అభ్యంతరకర అంశాలు, ఫొటోలు, వీడియోలు, సమాచారం వారికి అందజేశాడనే ఆరోపణలున్నాయి. రాజకీయ ప్రత్యర్థులు వాటిని ఎప్పటికప్పుడు జనసేన అధిష్టానానికి చేరవేశారని సమాచారం. వినుతను జనసేన నుంచీ బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ అధిష్టానం జారీ చేసిన ప్రకటనలో సైతం గత కొంతకాలంగా పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వినుత వ్యవహారశైలి వుందని పేర్కొన్న సంగతి ఈ సందర్భంగా గమనించాల్సి వుంది. మొత్తానికీ శ్రీనివాసులు హత్య కేసుతో వినుత రాజకీయ భవిష్యత్తు దెబ్బతిన్నట్టయింది.

# నూతన కాటేజీ విధానాన్ని రూపొందించండి

అధికారులకు టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశం



తిరుమల, జూలై 14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు వసతి కల్పించేందుకు నూతన కాటేజీ విధానాన్ని రూపొందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన సోమవారం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అధికారులతో సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా దాతలు కాటేజీలు నిర్మించేందుకు వీలుగా విధానపరమైన బ్లూప్రింట్‌ను తయారు చేయాలన్నారు. నిర్దేశించిన సమయానికి దాతలు కాటేజీలను నిర్మించి టీటీడీ అప్పగించేలా, దాతలకు కేటాయించిన ప్రివిలేజస్ దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. కాటేజీల నిర్మాణానికి దాతల ఎంపిక, విధివిధానాలు, బాధ్యతలు వంటి అంశాల్లో పారదర్శకంగా ఉండేలా నిబంధనలను రూపొందించాలన్నారు. అంతకు ముందు నూతన కాటేజీల నిర్మాణానికి సంబంధించిన విధానపరమైన అంశాలపై అదనపు ఈవో వెంకయ్య చౌదరి పర్సువల్ ద్వారా ఈవోకు వివరించారు. ఈ సమీక్షలో రిసెప్షన్ డిప్యూటీ ఈవో ఆర్1 భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టీజీపీ ఎస్ఈగా రాధాకృష్ణమూర్తి

తిరుపతి(విద్య), జూలై 14(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ, గాలేరు - నగరి ప్రాజెక్టుల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరుగా డి.రాధాకృష్ణమూర్తి నియమితులయ్యారు. ఆ మేరకు ఆయన సోమవారం తిరుపతిలోని నీటి పారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు వెంకటగిరి తెలుగు గంగ ప్రాజెక్టులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేశారు. పదోన్నతిలో భాగంగా పూర్తి అదనపు బాధ్యతలతో తెలుగు గంగ, గాలేరు - నగరి ప్రాజెక్టుల సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ప్రభుత్వం నియమించింది.

# 18 'విండో'లకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలు

- కాయంపేటకు అమాస.. ఐతేపల్లికి పల్లినేని




తిరుపతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 సింగిల్ విండోలకు అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీల స్థానంలో ప్రభుత్వం నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలను నియమించింది. శిద్ధవరం, చిట్టమూరు విండోల పదవీ కాలం అక్టోబరు నెలాఖరు దాకా ఉండగా, మిగిలిన 16కు ఈ నెలాఖరుకే ముగియనుండడం గమనార్హం. కాగా, **కాయంపేట** సింగిల్‌విండోకి చైర్మన్‌గా డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి.. సభ్యులుగా ఎం.దేవరాజులు నాయుడు, వేమూరి మంజుల నియమితులయ్యారు.

**ఐతేపల్లి:** పల్లినేని సుబ్రమణ్యం నాయుడు.. బి.భాస్కర్ బాబు, ఎం.వెంకటముని

**గూడూరు (24):** అల్లూరు కరుణాకర్‌రెడ్డి.. దువ్వూరు రవీంద్రరెడ్డి, బచ్చల రవీంద్రారెడ్డి

**బూదనం:** పెజ్జాయి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి.. అన్నంరెడ్డి కిరణ్, జరుగుమల్లి అనిల్

**తిప్పగుంటపాలెం:** దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి.. కండలి శీనయ్య, గోను కోటయ్య

**మల్లాం:** రామిశెట్టి హరినాథ్.. గొల్ల మణి, చేను వెంకటయ్య

**తిన్నెలపూడి:** పల్లగతి భాస్కర్‌రెడ్డి.. పనబాక కోటేశ్వరరావు, పుచ్చలపల్లి చిరంజీవి

**ఉనుగుంటపాలెం:** నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి.. పట్టపు వెంకటేశ్వర్లు, పాకనాటి జనార్దన్

**కొత్తపాలెం:** ఉచ్చూరు రవీంద్రారెడ్డి.. కాశల శ్రీనివాసులు, గుండాల సుబ్రమణ్యం

**చిట్టేడు:** చపలా శ్రీనివాసులు.. దూడిపల్లి సతీష్, చంద్రగిరి మధు

**వాకాడు:** ఉచ్చూరు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి.. దశకాయల కృష్ణమూర్తి, తిరుమూరు వెంకటకృష్ణారెడ్డి

**నరసింగాపురం:** పి.వినోద్ కుమార్.. బి.ఉమామహేశ్వరరావు, టి.రెడ్డెప్ప శెట్టి

**వడమాలపేట:** డి.భూచంద్ర ప్రసాద్.. వి.వెంకట్రమణ, ఎస్.పొన్నయ్య రాజు

**చెర్లోపల్లె:** జి.నరేంద్రరెడ్డి.. ఎస్.రాజేంద్ర నాయుడు, ఎం.విజయభాస్కరరాజు

**పరమేశ్వరమంగళం:** ఎస్.మోహన్ రాజు.. ఇ.సుధాకరుడు, డి.జాన్ భాస్కర్

**తడుకు:** సి.కరుణ.. ఎ.భాస్కర్, టి.విజయ్‌భాస్కర్‌రెడ్డి

**శిద్ధవరం:** సింగిల్‌విండో కమిటీకి చైర్మన్‌గా పి.కోటేశ్వరరెడ్డి, సభ్యులుగా కోట వాసు, జరుగుమల్లి మల్లీశ్వరి నియమితులయ్యారు.

**చిట్టమూరు:** గొండుబోయిన కస్తూరయ్య.. నరమల మోహన్, కంటేపల్లి వెంకటరమణయ్య.



బైరెడ్డి శబరి

## శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జూలై14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, కర్ణాటక మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు.

## శంకర్‌రెడ్డి ఇన్‌చార్జి కాదు: ఎమ్మెల్యే

సత్యవేడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధిష్ఠానం సత్యవేడుకు నూతనంగా నియమించిన కూరపాటి శంకర్‌రెడ్డి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జి కాదని, ఆయన కేవలం పార్టీ ప్రోగ్రామ్స్‌కో ఆర్డినేటర్ మాత్రమేనని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఈ మేరకు నియామక పత్రంలో స్పష్టంగా ఉందన్నారు. సత్యవేడులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శంకర్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే స్థానంలో ఎవరినీ ఇన్‌చార్జిగా నియమించలేరన్నారు. శంకర్‌రెడ్డి తనకు మిత్రుడు, సన్నిహితుడంటూనే.. కూటమిలోని నాయకులను, కార్యకర్తలందరినీ కలుపుకొంటూ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యేను వదిలేసి తిరిగితే ఎవరూ సహకరించరన్నారు. నియోజకవర్గానికి వస్తూనే ఫ్లెక్సీలు, అంగబలంతో బలప్రదర్శన చేయడం దేనికోసమన్నారు. ఆయనకు అధికారులు ఎస్కార్ట్‌తో స్వాగతం పలకడం, సెల్యూట్‌లు కొట్టడం ఎందుకని పోలీసులను ప్రశ్నించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

## వడ్డీ సహా రూ.20 లక్షలు ఎల్ఐసీకి జమ

నాయుడుపేట/టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్ఐసీలో ఒకరి బీమా పాలసీకి సంబంధించి మరొకరి ఖాతాకు 19,87,500 రూపాయలు జమ అయిన ఘటనలో అధికారులు విచారించారు. ఈ మేరకు 9 శాతం వడ్డీతో పాటు ఆ వ్యక్తి నుంచి సోమవారం ఎల్ఐసీకి రూ.20 లక్షలు జమ చేయించారు. కాగా, రికార్డులు తారుమారు చేసిన అధికారులు.. బాధ్యుడైన వ్యక్తి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో అంతుపట్టడం లేదు. ఇంత జరిగినా పోలీసులకూ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.


## సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**శనివారం హుండీ ఆదాయం: రూ.4.43 కోట్లు**

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,193**

**తలనీలాలు సమర్పించినవారు: 33,298**





**ప్రోగ్రెస్ రిపోర్ట్**



# ఏడాదిలో 1 ఏం చేశారు?

**వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**

# పరిశ్రమలపైనే దృష్టి

- రూ. 560 కోట్లతో జల్‌జీవన్ మిషన్
- వెంకటగిరిలో వంద పడకల ఆస్పత్రి...
- డయాలసిస్, ట్రామా కేర్ సెంటర్లకు ప్రతిపాదన
- ఏడాదిలో ఆల్తూరుపాడు, టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేయిస్తా!

వెంకటగిరి తెరమీదకు కురుగొండ్ల రామకృష్ణ వారసురాలు వచ్చారని 2024లో అంతా అనుకున్నారు. ఆయన కూడా కుమార్తెను నడిపించే బాధ్యత తీసుకున్నారు. అయితే రాజకీయ పరిస్థితుల వల్ల అనూహ్యంగా మళ్లీ రామకృష్ణకే టికెట్ ప్రకటించడంతో మూడోసారి ఆయన వెంకటగిరి ఎమ్మెల్యే అయ్యారు. రోజూ ఉదయం 6 నుంచీ అర్ధరాత్రి దాకా నియోజకవర్గంలో పర్యటిస్తూనే వుంటారు. సమస్యలపై వచ్చిన ప్రజలను ఏ పార్టీ అని అడగరు. సమస్య మాత్రమే అడిగి వేగంగా స్పందిస్తారు. పని పూర్తయిందా లేదా అని ఫాలోఅప్ కూడా చేస్తారు. వెనుకబడిన వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధికి ఆయన ఈ ఏడాదిలో ఏం చేశారు? ఏం చేయలేకపోయారు? ఇంకా చేయాల్సినవి ఏమిటి? మలి ఏడాది లక్ష్యాలుగా ఏవి నిర్దేశించుకున్నారు.. ఈ అంశాల సమాహారం...

**- కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి**

**వంద కోట్లతో అభివృద్ధి పనులు :**

నియోజకవర్గంలో ఏడాది కాలంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఉపాధి హామీ, ఆర్ డబ్ల్యుఎస్ తదితర శాఖల ద్వారా సుమారు రూ. వంద కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. పది శాతం పనులు పురోగతిలో వున్నాయి.



బాలాయపల్లి మండలం కడగుంట గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు



రాపూరు మండలం లక్ష్మీపురంలో నిర్మించిన సీసీ రోడ్డు



కలువాయి వెంకయ్య స్వామి గుడి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

**ఆర్ అండ్ బీ పనులు:**

వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలో రూ. 5.81 కోట్లు, కలువాయి మండలంలో రూ. 4.75 కోట్లు, సైదాపురం మండలంలో రూ. 47.46 కోట్లు, రాపూరు మండలంలో రూ. 1.16 కోట్లు చొప్పున మొత్తం రూ. 59.16 కోట్లతో రోడ్ల విస్తరణ, అభివృద్ధి, మరమ్మతు పనులు జరిగాయి.

**ఇరిగేషన్ పరిధిలో :**

ఎస్‌డీఎంఎఫ్ కింద రూ. 50 లక్షలతో 6 పనులు, ఎఫ్‌డీఆర్-2024 కింద రూ. 9.85 కోట్లతో 156 పనులు, ఓ అండ్ పి కింద రూ. 42 లక్షలతో 15 పనులు చొప్పున మొత్తం రూ. 10.77 కోట్లతో 177 పనులు చేపట్టం జరిగింది. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా రూ. 1.61 కోట్లతో 237 పనులు జరిగాయి.

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 18.82 కోట్లతో 318 పనులు చేపట్టారు.
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 9.06 కోట్లతో 3822 పనులు చేపట్టారు.



మరమ్మతుల అనంతరం బాగుపడిన రాపూరు మండలం మద్దెలమడుగు నుంచి గూడూరు వెళ్లే రోడ్డు



డక్కిలిలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం



వెంకటగిరి-యాతలూరు మార్గంలో నిర్మించిన తారు రోడ్డు

**పేరు: కురుగొండ్ల రామకృష్ణ (63)**
**భార్య: సింధు, కుమార్తె: లక్ష్మీ సాయి ప్రియ**
**స్వస్థలం: పాతనాల పాడు, డక్కిలి మండలం**

## ఎమ్మెల్యే ఏమంటున్నారంటే..

**?** నెల్లూరు జిల్లా నుంచి విడిపోయి తిరుపతిలో సగం కలిసిన వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడే ఉంది. ఈ విషయంలో మీరు చేస్తున్న ప్రయత్నాలు ఏమిటి?

**!** వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలన్నింటినీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళాను. ఇరిగేషన్ శాఖకు సంబంధించి తెలుగుగంగ ప్రాజెక్టులో చెన్నై కెనాల్ నుంచీ నాలుగు చోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు అవసరాన్ని సీఎంకు వివరించి ప్రతిపాదనలు కూడా అందజేశా. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వెంకటగిరి మున్సిపల్ పట్టణంలో ప్రస్తుతమున్న ప్రభుత్వాస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని కోరా. అలాగే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా సీఎంకు వివరించా. జల్‌జీవన్ మిషన్ కింద వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లోని ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేసే విధంగా రూ. 560 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

**?** వెంకటగిరి నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. మీరు చేస్తున్న కృషి ఏమిటి?

**!** పెద్ద సంఖ్యలో ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో వున్నాయి. వెంకటగిరి మండలం కుర్తేగుంటలో 1500 ఎకరాల ప్రభుత్వ భూమి వుంది. అలాగే రాపూరు మండలంలో ఏకంగా 6 వేల ఎకరాల రెవిన్యూ అటవీ భూములున్నాయి. ఈ భూముల్లో సెజ్ లేదా పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయాలని సీఎంను కోరాం.

### సొంత నిధులతో పోలేరమ్మ ఆర్చి



వెంకటగిరి అంటే గుర్తొచ్చేది పోలేరమ్మ దేవత. ఏటా వైభవంగా జరిగే పోలేరమ్మ జాతరకు దేశవిదేశాల నుంచీ భక్తులు పోటెత్తి వస్తారు. వెంకటగిరిలో అడుగుపెట్టగానే పట్టణ వైభవం, పోలేరమ్మ గుర్తుకు వచ్చేలా కనిపించాలనే ఉద్దేశ్యంతో సొంత నిధులు రూ. 50 లక్షలు వెచ్చించి ఆర్చీ నిర్మాణం ప్రారంభించా. పనులు వేగంగా జరుగుతున్నాయి.

### రెండో ఏడాది లక్ష్యాలు

- రెండవ ఏడాది ముగిసేలోపు అల్తూరుపాడు రిజర్వాయర్ మంజూరు చేయిస్తా. రూ.768 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. మంజూరయ్యే దశలో వుంది.
- జరీ, చేనేత పరిశ్రమకు ఆయువుపట్టులాంటి వెంకటగిరిలో వేలాది మంది నేత కార్మికులున్న కారణంగా వెంకటగిరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయిస్తా. ఇప్పటికే సీఎం చంద్రబాబును కలసి ప్రతిపాదనలు అందజేశా.

### ఎమ్మెల్యే ముందున్న సవాళ్లు

- అలపలేరు డ్యామ్ ఆధునీకరణ
- వెంకటగిరిలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు
- కలువాయి చెరువు ఆధునీకరణ
- తెలుగు గంగ బ్రాంచి కెనాల్స్ నిర్మాణం
- జౌళి పరిశ్రమ ఏర్పాటుకు పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీ
- వెంకటగిరి - కోడూరు రోడ్డు పనులు పూర్తి చేయడం



నాయుడుపేటలో చోరీకి గురైన బంగారు నగలు రికవరీ చేసిన పోలీసులు

## పగలే ఇళ్లలో చొరబడి..!

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
- 416 గ్రాముల బంగారు నగలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 14(ఆంధ్రజ్యోతి): పగటిపూటే ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర నిందితుడు చందక మణికంఠను నాయుడుపేట పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.37.44 లక్షల విలువ చేసే 416 గ్రాములు బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సోమవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. పార్వతీపురం జిల్లాకు చెందిన చందక మణికంఠ డిగ్రీ వరకు బాగా చదివాడు. ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. కష్టపడి పనిచేయడం ఇష్టంలేక ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. తోటి స్నేహితులతో కలిసి మద్యానికి బానిసయ్యాడు. జీవితాన్ని ఎంజాయ్ చేయాలని భావించి పాత నేరస్థులతో కలసి దొంగతనాలకు దిగాడు. గతంలో జైలులో ఉండొచ్చిన వారితో చేతులు కలిపాడు. దొంగతనాల్లో ప్రావీణ్యం పొందాడు. ఈ క్రమంలో పార్వతీపురానికి చెందిన మహిళతో వివాహమైంది. పిల్లలు లేరు. విశాఖ పరిధిలోని మువ్వలపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో మూడు ఇంటి దొంగతనాలు చేశాడు. ద్వారకాపురం స్టేషన్ పరిధిలో మరో మూడు కన్నాలేసి నేరాలకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో ఇతడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా, బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇతడిపై విశాఖ పోలీసులు సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశారు. తాజాగా తడ, నాయుడుపేట, శ్రీసిటీ, వరదయ్యపాలెం పరిధిలో పలు చోట్ల దొంగతనాలకు పాల్పడగా, కేసులు నమోదయ్యాయి. తాజాగా నాయుడుపేట పరిధిలోని ముగాంబిక దేవాలయం వీధిలోని గంగినేని హరీంద్ర ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డాడు. 416 గ్రాముల బంగారు నగలు, అపహరించుకుని పరారయ్యాడు. నాయుడుపేట అర్బన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు, సీఐ ఎం.బాబీ, పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి కదలికలు గుర్తించి పట్టుకున్నారు. ఇప్పటి వరకు మణికంఠపై 14 కేసులు ఉన్నాయి. నిందితుడ్ని అరెస్టు చేసి చోరీ సొత్తు రికవరీలో ప్రతిభ కనపరచిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబీ, ఎస్ఐ ఆదిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజు, కానిస్టేబుళ్లు దయాకర్, భానుతేజ, వెంకటేశ్వర్లు, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు.

## భూ సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..!

**అధికారులతో అర్జీదారుల మొర**
**పీజీఆర్ఎస్‌కు 301 వినతులు**



వినతులు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 14(ఆంధ్రజ్యోతి): 'భూ సమస్యలు పరిష్కరించమని చాలా వారాలుగా తిరుగుతున్నాం.. పట్టించుకోవడం లేదు.. వాటిపై దృష్టి పెట్టండి మహాప్రభో' అంటూ పలువురు అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన ప్రజలతో కలెక్టరేట్ కిక్కిరిసింది. మొత్తం 301 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 136 వచ్చాయి. వెంటనే పరిష్కరించాలని జేసీ శుభం బన్సల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

### పొదుపు డబ్బులు ఆర్పీ స్వాహా చేసింది



16ఏళ్లగా మేము పొదుపు సంఘంలో సభ్యులుగా ఉన్నాం. గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది జూన్ వరకు చెల్లించిన పొదుపు సొమ్ము బ్యాంకులో జమకాలేదు. ఆర్పీ లతకు డబ్బు ఇస్తే ఆమె బ్యాంకులో కట్టి రసీదు తెచ్చి ఇచ్చేది. ఇటీవల మా వద్ద ఉన్న సంఘం పుస్తకాలు, బ్యాంకు రసీదులు ఆమె తీసుకుంది. బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ చూడగా మా గ్రూపునకు సంబంధించి రూ.6.80లక్షలు జమ కాలేదని బ్యాంకు అధికారులు తెలిపారు. దీనిపై విచారించగా నేను ఒకదాన్నే సొమ్ము స్వాహా చేయలేదు. మెప్మా అధికారులు, సిబ్బందికి వాటాలు ఇచ్చానని చెప్పింది. విచారణ జరిపి న్యాయం చేయండి.

**- భాగ్యలక్ష్మి సంఘం సభ్యులు, కైకాల చెరువు, తిరుపతి**

### మా పిల్లలకు చదువు దూరం చేయొద్దు



కేవీబీపురం మండలం పాతపాళెం హరిజనవాడలో 30 ఏళ్లగా ప్రాథమిక పాఠశాల ఉందని, 40 మంది పిల్లలు చదువుకుంటున్నారని, ప్రస్తుతం 3, 4, 5 తరగతుల విద్యార్థులను పక్క ఊరు స్కూల్‌కు పంపించాలని ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని గ్రామస్తులు డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలను తరలిస్తే తమ పిల్లలకు చదువు దూరమవుతుందని తెలిపారు. అలాగే ఏర్పేడు మండలం పల్లంపేట పాఠశాల విద్యార్థులను 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పాఠశాలకు తరలించాలని అధికారులు పూనుకోవడం సబబు కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ నేత సుబ్రహ్మణ్యం అన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవ తీసుకుని పాఠశాలల తరలింపును అడ్డుకోవాలని కోరారు.

### కలపాడు భూములు పంచాలి



వెంకటగిరి నియోజకవర్గం కలపాడులో ఉన్న ప్రభుత్వ భూమిని దళిత, గిరిజనులకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కలపాడు పంచాయతీ పరిధిలో 1,400 ఎకరాలకు పైగా ప్రభుత్వ మేత పోరంబోకు భూములు ఉన్నాయని, వాటిని గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు రెండు ఎకరాల చొప్పున పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెంగయ్య, కృష్ణయ్య, లోకేష్, చెంచుకుమార్, సమరం పాల్గొన్నారు.

### రేషన్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించలేదు



తమకు రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించడంలేదని సత్యవేడు మండలం పేరడం గ్రామం, ఎస్టీకాలనీకి చెందిన వెంకటరత్నం, వీరమ్మ తదితరులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కూలీనాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఆస్తులు లేవని, పథకాలు ఇస్తే ఆసరాగా ఉంటుందని వేడుకున్నారు.

### జాతీయ రహదారి పేరుతో చెరువులు పూడ్చేస్తున్నారు

జాతీయ రహదారుల విస్తరణ పేరుతో తూకివాకం, దామినేడు, ఓటేరు, పేరూరు చెరువులను పూడ్చివేస్తున్నారని జైహిందుస్థానీ పార్టీ నేత నీలకంఠ అన్నారు. చెరువులు ఉన్న ప్రాంతాల్లో నీటి వనరులను రక్షిస్తూ ఫ్లైవోవర్ నిర్మించాలని డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు.





చిట్టెమ్మ (ఫైల్), వడమంచి శ్రీను (ఫైల్)

## ఆ 9 మంది మృతుల్లో ఐదుగురు శ్రీకాళహస్తివారే

- మామిడి కోతలకు వెళ్లి విగతజీవులుగా మారిన గిరిజనులు
- మృతదేహాల రాకతో విషాదం

రైల్వేకోడూరు/శ్రీకాళహస్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వారంతా నిరుపేద గిరిజనులు. మామిడి సీజన్‌లో కాయల కోతలకు వెళుతుంటారు. అలా ఆదివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలోని ఇసుకపల్లెలో మామిడి కోతకు వెళ్లారు. పని ముగించుకుని లారీలో కాయలను వేసుకుని వస్తుండగా పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద ఆదివారం రాత్రి లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో 9 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో నలుగురు రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట.. మిగిలిన ఐదుగురు శ్రీకాళహస్తి మండలం కలవగుంట, గుండ్లపల్లి, చుక్కలనిడిగల్లు ఎస్టీ కాలనీలకు చెందిన వారని తెలిసింది. వీరి మృతదేహాలు సోమవారం ఆయా కాలనీలకు చేరడంతో విషాదం నెలకొంది. శెట్టిగుంటతో పాటు శ్రీకాళహస్తి ప్రాంతంలోని వీరంతా బంధువులే. మృతి చెందిన వారిని గజ్జల గంగమ్మ, చిట్టెమ్మ, రాధమ్మ, జాని, వడమంచి శ్రీను, గజ్జల సుబ్బరత్న, గజ్జల దుర్గయ్య దంపతులుగా గుర్తించారు. వీరిలో వడమంచి శ్రీనుది శ్రీకాళహస్తి మండలం గుండ్లపల్లి.. చిట్టెమ్మది కలవగుంట ఎస్టీకాలనీలు. వీరి మృతదేహాలకు సోమవారం బొజ్జల బృందమ్మ నివాళులర్పించారు. మృతుల కుటుంబీకులకు ఆర్థికసాయం చేశారు. మిగతా ముగ్గురి విషయంలో స్పష్టత లేదు. కాగా, రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్షలు పూర్తయి అంబులెన్సుల్లో ఆయా గ్రామాలకు మృతదేహాలను చేర్చారు.

**అధిక లోడ్డే కారణం**

ప్రమాదానికి గురైంది ఆరు టైర్ల లారీ. ఈ లారీలో సాధారణంగా 6 టన్నులే వేయాలి. దీనికన్నా ఎక్కువగా వేశారు. ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసి ఆ తర్వాత ముందు వచ్చే కారును తప్పించాలని చూడటంతో బోల్తాపడిందని స్థానికులు స్థానికులు చెబుతున్నారు.

## మేతపోరంబోకు భూమిలో పరిశ్రమ వద్దు



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మేకనూరు గ్రామస్తుల ధర్నా

గూడూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మేతపోరంబోకు భూమిలో పరిశ్రమను ఏర్పాటు చేయవద్దని కోరుతూ మండలంలోని మేకనూరు గ్రామస్తులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని మేతపోరంబోకు భూముల్లో గ్రామానికి చెందిన పాడిరైతులు గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ భూములను పరిశ్రమకు అప్పగిస్తే పాడి రైతులు జీవనోపాధిని కోల్పోయి, వలస వెళ్లాల్సిన వస్తుందన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విజయ, ఉమామహేశ్వరి, అమరేంద్ర, రమేష్, కృష్ణయ్య, తిరుపాలయ్య, రమణయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## సొనకాలువలో పడి యువకుడి మృతి



మృతిచెందిన అవినాష్

చిల్లకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకువారిపాళెం గ్రామ సమీపంలోని సొనకాలువలో పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం వేకువన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని తిక్కవరం గ్రామానికి చెందిన అవినాష్(25) ఆదివారం కాకువారిపాళెం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం వేకువన గ్రామానికి సమీపంలో బహిర్భూకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు సొనకాలువలో పడి మృతిచెందాడు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సొనకాలువ వద్దకు చేరుకుని మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య

తడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని రామాపురం పంచాయతీ కావలిమిట్ట గ్రామానికి చెందిన సయ్యద్ సాధిక్‌బాషా (34) కూలి పనులకు వెళ్తుంటాడు. నాలుగు నెలలుగా పనులకు వెళ్లకుండా ఇంటివద్దే ఉండడంతో భార్య సంధ్య ప్రశ్నించింది. దీంతో మనస్థాపం చెందిన సాధిక్‌బాషా శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు అతనిని చెన్నైలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అవకతవకలపై విచారణ జరపాలి

గూడూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి విందూరు మీదుగా గిద్దలూరు వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతుల పనుల్లో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గూడూరు నుంచి గిద్దలూరు వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతుల పనుల్లో జరిగిన అవకతవకలపై, చిల్లకూరు, కోట మండలాల్లో సిలికాలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో వేమయ్య, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించండి

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో పనిచేసే ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలంటూ ఎనర్జీ ఎంప్లాయూస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సూళ్లూరుపేట విద్యుత్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకుడు కైలాసం అశోక్ మాట్లాడుతూ ఐదేళ్లుగా పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు కొత్త సర్వీసు రూల్స్ విధానం వల్ల పదోన్నతులు కోల్పోతున్నారన్నారు. పాత సర్వీసు రూల్స్ అమలు చేసి అర్హులైన ఎనర్జీ అసిస్టెంట్లకు ఏఎల్‌ఎంగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 21 చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, రామయ్య, శ్రీనివాసులు, మురళి, తేజ తదితరులు పాల్గొన్నారు.

## భూములకు పరిహారం ఇవ్వండి



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అగ్రహారం రైతులు

కోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డుకు తీసుకున్న భూములకు పరిహారం చెల్లించాలంటూ మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీ విశ్వనాథపుర అగ్రహారం రైతులు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సాగరమాల రోడ్డు నిర్మాణానికి సన్న, చిన్నకారు రైతుల నుంచి పట్టా భూములు తీసుకుని పరిహారం చెల్లించడంతో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు జయజయరావుకు అందజేశారు.

## దామరాయిలో పీర్ల పండగ



గ్రామంలో జెండాలతో ఊరేగుతున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని దామరాయిలో సోమవారం పీర్ల పండగ నిర్వహించారు. జల్లవానిపట్టెడ పీర్లచావడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి గ్రామస్తులు జెండాలతో దామరాయి, కొల్లపొట్టు గ్రామాల వరకు ఊరేగింపుగా వెళ్లి జెండా నిషాన్ చేశారు. 40 సంవత్సరాల క్రితం ఆగిపోయిన పీర్ల పండగను సర్పంచు రమణమ్మ, టీడీపీ నాయకులు మాగర్ల తిరుపాల్ ఆధ్వర్యంలో ఈ ఏడాది నిర్వహించడంతో గ్రామంలో పండవాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మునస్వామి, జానకీరామయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి అందజేత

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోటకట్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎన్‌జీవో యాదుమది సంస్థ నిర్వాహకుడు వెంకట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం పునరుద్ధరణ

పెళ్లకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నప్పనాయుడుపేట పంట పొలాల్లో విద్యుత్ స్తంభం నేలకూలినా పట్టించుకోకపోవడంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ స్తంభాన్ని నాటి సరఫరా పునరిద్ధించారు.

## రెండు రోజులపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం

నాయుడుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విన్నమాల పంటకాలువ పూడికతీత పనుల సందర్భంగా తాగునీటి పైపులు దెబ్బతిన్నాని, దీని వల్ల పట్టణంలో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. పొగగొట్టంకాలనీ కాలువ గట్టుకాలనీ, శంకరాపురం, జైహింద్‌కాలనీ, బాలాజీ గార్డెన్, బ్రాహ్మణ వీధి, రజకకాలనీ, గెరిడీవీధి, రాజగోపాలపురం, బజారువీధి ప్రాంతాల్లో పైపు లైన్లు మరమ్మతులకు గురైనట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని, ఇందుకోసం వి.నాగరాజు 9849742056, ఎం.శ్రీనివాసులు 9666612492, వీరాస్వామి 9491285256 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

# అడుగడుగునా గోతులే

- అధ్వానంగా కోటపోలూరు రోడ్డు
- వాహనదారులకు నరకం

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి కోట - వాకాడుకు వెళ్లే రహదారి కోటపోలూరు నుంచి అధ్వానంగా ఉంది. కోటపోలూరు రైల్వేగేటు నుంచి హరిజనవాడ వరకు దాదాపు 5 కిలోమీటర్ల మేర రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దారి పొడవునా గుంతలు ఉండడంతో దిచక్ర వాహన దారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు సైడ్ బర్మర్లు కూడా వర్షపునీటికి కోతకు గురవ్వడంతో ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు సాహసం చేయాల్సిన పరిస్థితి వస్తోందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గత వైసీపీ పాలనలో ఈరోడ్డు గురించి పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన మరమ్మతులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన తేలికపాటి జల్లులకు రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో మరింత దారుణంగా తయారైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోటపోలూరు, కోట - వాకాడు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న కోటపోలూరు రోడ్డు

# సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన: పాశిం

చిట్టమూరు, జులై 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉప్పలమర్తి, మెట్టు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పలమర్తి, మెటు గ్రామాల్లో రూ.10లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. గ్రామాల్లో మొక్కలు నాటారు. మెట్టులో సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొని వారికి అన్నప్రాసన, సారె అందించి ఆశీర్వదించారు. ఉప్పలమర్తిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు సుపరిపాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. అభివృద్ధితో హామీలను అమలు పరుస్తూ సంక్షేమం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దారు సతీష్ కుమార్, గూడూరు నియోజకవర్గ పరిశీలికుడు ఈశ్వరవాక శివకోటరెడ్డి, టీడీపీ నాయకులు మారంరెడ్డి జనార్దనరెడ్డి, దువ్వూరు భారతమ్మ, కస్తూరయ్య, గుంపర్ల చిన్నారావు, కాపులూరు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలమర్తిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు: విజయశ్రీ



కోటపోలూరులో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు శంకరయ్య, సుధాకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని కోటపోలూరు, సామంతమల్లాం, ఆబాక గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విజయశ్రీ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు క్లిష్టతరంగా ఉన్నప్పటికీ ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే అజెండాగా పాలన సాగుతోందన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంగా పనిచేస్తూ సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కోటపోలూరు ప్రాథమిక పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అదే విధంగా ఆబాక అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించి వారికి పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, కరకంబేటి సుబ్రహ్మణ్యం, జనార్దన్, ఏలిబేటి సతీష్, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ధ్యేయం: కురుగొండ్ల

బాలాయపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి) అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పెరిమిడి పంచాయతీ మేల్చూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అగుడు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రూ.4 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. నోషనల్ ఖాతాతో అన్నదాత సుఖీభవ పథకానికి దూరమవుతున్నారని కొందరు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి నోషనల్ ఖాతాలను రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని మేల్చూరు గిరిజన కాలనీవాసులు చెప్పడంతో వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు వనమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు జన్ని రమణయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగంశెట్టి భాస్కరరావు, దాసరి రాజగోపాల్‌నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, రాయి సత్యం నాయుడు, కూను శ్రీహరి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, నల్లబోతుల మురళి, చిత్తూరు ఈశ్వరయ్య, మల్లెమాల గోపీకృష్ణారెడ్డి, దాసరి కోటేశ్వరావు, వేళ్ల సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మేల్చూరులో సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

## పోక్సో కేసు నమోదు

వెంకటగిరి టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దకృష్ణ అనే వ్యక్తిపై పోక్సో నమోదు చేశామని ఎస్ఐ ఏడుకొండలు సోమవారం తెలిపారు. 17 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో మోసం చేయడంతో బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

## శ్మశానం దారి కబ్జా

వెంకటగిరి టౌన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుసపాళెం గిరిసుల శ్మశానం దారి కబ్జా చేశారని గ్రామస్తులు సోమవారం సీనియర్ అసిస్టెంట్‌కు నాగమల్లీశ్వరికి సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య, సిద్ధరామయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సాగరమాల రోడ్డు పనుల పరిశీలన

కోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని సాగరమాల రోడ్డు పనులను నేషనల్ హైవే అథారిటీ ఢిల్లీ అధికారులు పరిశీలించారు. చెందోడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, కర్లపూడి, కనుపూరు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు, కల్వర్టులు, అండర్ బ్రిడ్జిలను నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ జనరల్ మేనేజర్ పహిరాం, డీజీఎం రాజ్‌కుమార్ నగ్రవాల్, సాగరమాల పీఆర్‌వో దిలీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు ఏపీఎంగా పోలమ్మ

వాకాడు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వాకాడు వెలుగు ఏపీఎంగా పోలమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాలయపల్లి మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న పోలమ్మ బదిలీపై వాకాడుకు వచ్చారు.

## హెల్పర్లకు సామగ్రి అందజేత

కోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఐటీడీఎస్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల హెల్పర్లకు సోమవారం సీడీపీవో మునికుమార్ ఆధ్వర్యంలో హెల్పర్లకు సామగ్రిని పంపిణీ చేశారు.

## పీజీఆర్‌ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి

డక్కిలి, జులై 14 (ఆంధ్రజ్యోతి) ప్రజా విజ్ఞప్తుల దినంలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినంలో సుమారు 50 అర్జీలు వరకు వచ్చాయని, వీటిలో చాలా వరకు అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందన్నారు. ఎక్కువగా భూ సమస్యలపై అర్జీలు అందినట్లు తెలిపారు.

## భూములకు ఆధార్ అనుసంధానం చేసుకోండి

చిట్టమూరు, జులై 14(ఆంధ్రజ్యోతి): భూములకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దారు సతీష్ కుమార్ సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో పేర్లు లేకపోవడానికి భూమికి ఆధార్ నెంబర్ అనుసంధానం కాకపోవడం కారణమన్నారు.

## నేటి నుంచి గ్రామసభలు

నాయుడుపేట టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 15నుంచి 25వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. పీ-4 సర్వే ధృవీకరణలో భాగంగా బంగారు కుటుంబాల తుది జాబితా రూపొందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. **ఓజిలి:** మండలంలో మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు పీ-4 సర్వే పునఃధృవీకరణ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

## కారు దగ్ధం

చిల్లకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదనం గ్రామ సమీపంలోని డెయిరీ వద్ద సోమవారం ఓ కారులో దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు... తిరుపతి నుంచి ఒంగోలుకు కారులో వెళుతున్నవారు బూదనం గ్రామ సమీపంలోని పాలడెయిరీ వద్ద ఆగి కూల్‌డ్రిక్స్ తాగేందుకు దుకాణంలోకి వెళ్లారు. అదే సమయంలో కారులో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది.

## క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

దొరవారిసత్రం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం దొరవారిసత్రం, తొగరాముడి పీహెచ్‌సీల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్త్రీలకు నోటి, గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కె.నాగరాజు పర్యవేక్షణలో వైద్యులు తరుణ్‌సాయికుమార్, చైతన్య, నవీన, చైతన్యబాను, హిరత పరీక్షలు నిర్వహించారు. అలాగే 15వ తేదీన గొట్టిప్రోలు, పేర్నాడు, 17వ తడ, రామాపురం, 18వ తేదీన మల్లాం, ఈశ్వారవాక పీహెచ్‌సీల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ నాగరాజు తెలిపారు.

## నేడు ఆల్తూరుపాడులో ఎమ్మెల్యే పర్యటన

డక్కిలి, జులై 14 (ఆంధ్రజ్యోతి): సురిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆల్తూరుపాడు గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యటించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ కార్యాలయాల వద్ద పిచ్చిమొక్కల తొలగింపు

తడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పిచ్చిమొక్కలను అధికారులు తొలగింపజేశారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇబ్బడి ముబ్బడిగా పిచ్చిమొక్కలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోందని ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. సోమవారం తహసీల్దారు శరత్‌బాబు, ఎంఈవో మల్లికార్జునరావు చొరవ తీసుకుని కూలీల సాయంతో పిచ్చిమొక్కలను తొలగించారు. అలాగే వ్యవసాయశాఖ, ఉపాధి, పీహెచ్‌సీల వద్ద ఉన్న పిచ్చిమొక్కలను రెండు రోజుల్లో తొలగించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు.

## నాలుగు దుకాణాల్లో చోరీ

గూడూరు, అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని ద్రౌపది కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాల్లో సోమవారం చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు... ద్రౌపది కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాలపై ఉన్న రేకులను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి లోపలికి ప్రవేశించారు. ఓ సెల్‌ఫోన్ రిపేర్ షాపులో మరమ్మతులకు గురైన నాలుగు సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదు, పక్కనే ఉన్న చిల్లర దుకాణంలో రూ.4వేల నగదు ఎత్తుకెళ్లారు. మరో రెండు దుకాణాల్లో చోరీకి యత్నించినా అందులో నగదు లేకపోవడంతో వెళ్లిపోయారు. ఆయా దుకాణదారులు పోలీసులకు సమాచారం అందించారు.

### వరుస చోరీలతో ప్రజల భయాందోళన

పట్టణంలో ఇటీవల వరుసగా చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉంటే టవర్‌క్లాక్ సెంటర్ సమీపంలోని దుకాణాల పైన రేకులు తొలగించి చోరీకి పాల్పడడం, ఇటీవల గమళ్లపాళెంలోని ఓ ఇంట్లో 30 సవర్ల బంగారాన్ని అపహరించుకువెళ్లడం, అశోక్‌నగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీకి యత్నించడం వంటి సంఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు గస్తీ పెంచి చోరీలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలి




నిరసన కార్యక్రమంలో చింతా మోహన్, పక్కన కాంగ్రెస్ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద పిల్లలను దృష్టిలో పెట్టుకుని దళితవాడ, గిరిజన సెంటర్లతో పాటు అవసరమైన చోట ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చాలాచోట్ల ప్రాథమిక పాఠశాలలను రద్దు చేయడం అన్యాయమన్నారు. వెంటనే దీనిని ప్రభుత్వ ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, ఈశ్వరయ్య, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో 25 శాతం బహుజనులకు అప్పగించాలి

నాయుడుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు, గనుల మైనింగ్ అనుమతుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, బహుజనులకు 25 శాతం అప్పగించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. సోమవారం నాయుడుపేట అంబేడ్కర్ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా బహుజనులకు ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో 25శాతం భాగస్వామ్యం చేయడం ద్వారా ఆయా సామాజిక వర్గాలు కూడా ఆర్థికంగా బలపడుతాయన్నారు. సైదాపురంలోని క్వాడ్జ్, చిల్లకూరులోని సిలుకా, నాయుడుపేట, సూళ్లూరుపేటలోని ఇసుక తదితర వాటిల్లో కూడా బహుజనులకు వాటా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి వెంకటయ్య, నాగూరయ్య, చిరంజీవి, శివ, శంకర్‌రాజు, శంకరయ్య, నాగయ్య తదితరులు ఉన్నారు.

## పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వండి

గూడూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు అందజేయాలని విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఏసుపాక పెంచలయ్య అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మిటాత్మకూరు గ్రామస్తులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మిటాత్మకూరు గ్రామంలో 20 మంది ఎస్సీ, ఎస్టీలు కొన్నేళ్లుగా భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి పట్టాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లురాజు, శ్రీహరి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గ్రావెల్ తరలింపు

ఓజిలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ముమ్మాయపాళెంలో సోమవారం అక్రమంగా గ్రావెల్ తరలింపు కొనసాగింది. గ్రామానికి సమీపంలోని సంపద తయారీ కేంద్రం వద్ద ప్రభుత్వ భూముల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఇళ్లు, ఇతర అవసరాల పేరుతో కర్మాగారాలకు గ్రావెల్ తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో తహసీల్దారు పద్మావతి స్పందించి వీఆర్వోను పంపించి గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు.

## మా గ్రామంలోనే బడి ఉండాలి




పాఠశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

తడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోనే బడి ఉండాలని, లేకుంటే మరో పాఠశాలకు పిల్లలను పంపబోమని తడ హరిజనవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు తేల్చి చెప్పారు. సోమవారం పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలోని పాఠశాలలోని 3,4,5 తరగతులను తడకండ్రిగ ప్రాథమిక పాఠశాలకు విలీనం చేశారని, అంతదూరం పిల్లలను పంపలేమని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి తడ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలోనే 3,4,5 తరగతులను కొనసాగించాలని కోరారు.

## విద్యార్థులకు గొడుగుల పంపిణీ

సూళ్లూరుపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు సోమవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా గొడుగులు పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవ నాయుడు, వాకచర్ల రమేష్, అలవల శ్రీనివాసులు కొమరం శ్రీధర్, దంతాల రవి, ఏడుకొండలు పాల్గొన్నారు.